తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల | వనపర్తి | నారాయణపేట | నాగర్ కర్నూల్
శనివారం
12 సెప్టెంబర్ 2026





## పెద్దచెరువు ట్యాంక్‌బండ్ పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 11(జనంసాక్షి):** మహబూబ్‌నగర్ పెద్దచెరువు ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనుల్లో మిగిలిన పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె పెద్దచెరువు మినీ ట్యాంక్‌బండ్, పక్కనే ఉన్న శిల్పారామాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు.

పెద్దచెరువులో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పెండింగ్ పనుల వివరాలను పరిశీలించారు. ఇప్పటికే చేపట్టిన పనులను పరిశీలించి, అవసరమైన చోట మార్పులు, అదనపు అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**శిల్పారామంలో అక్టోబర్ 1 నుంచి స్టాళ్లు ప్రారంభం...**

అనంతరం శిల్పారామాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. స్టాళ్లను ఎవరెవరికి కేటాయించారు, వాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేటాయించిన అన్ని స్టాళ్లను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అక్టోబర్ 1వ తేదీ నుంచి శిల్పారామంలోని అన్ని స్టాళ్లు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై నవాబుపేట పోలీసుల నిఘా

- రంగంలోకి 'రుద్ర' జాగిలం
- చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు (ఎస్సై నరేందర్ )




**నవాబుపేట్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్న మాదక ద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ యాక్షన్ ప్లాన్ ప్రారంభించింది. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు శుక్రవారం నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నవాబుపేట ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పోలీసు సిబ్బంది... ప్రత్యేక శిక్షణ పొందిన 'రుద్ర' జాగిలం (స్నిఫర్ డాగ్) సహాయంతో మండల కేంద్రంలోని పలు అనుమానిత ప్రాంతాలు, పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, నివాసాలపై విస్తృతంగా సోదాలు నిర్వహించారు. తల్లిదండ్రులు, యువత అప్రమత్తంగా ఉండాలి: పోలీసులు ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ... యువతను మాదకద్రవ్యాల మహమ్మారికి దూరంగా ఉంచడంతో పాటు, డ్రగ్స్ అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పోలీసు శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాచారం ఇస్తే వివరాలు గోప్యంగా ఉంచుతాం. మండల పరిధిలో ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయాలు లేదా రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించి, బాధ్యతగా భాగస్వాములు కావాలని జిల్లా పోలీసులు పిలుపునిచ్చారు.

## అవకతవకలకు తావులేకుండా భూ రీ సర్వే

- ఎస్సీ వసతి గృహానికి త్వరలో నూతన భవనానికి నిధులు మంజూరు చేయిస్తాం
- ప్రభుత్వ ఆసుపత్రిలోని వసతులపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



మిగతా 2లో..

ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 11 (జనం సాక్షి): గ్రామాల్లో చేపడుతున్న భూ రీ సర్వేను క్రమబద్ధంగా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మల్లాపురం గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను ఆయన పరిశీలించారు. గ్రామస్థులు, రైతులు సర్వేకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

మల్లాపురం పరిధిలో 700 ఎకరాలకు పైగా భూములను రీ సర్వే చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను తెలుసుకున్నారు. రోజుకు కనీసం 50 ఎకరాల భూమిని సర్వే చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ మ్యాపింగ్‌లో తప్పులు లేకుండా సరైన విధానాలను పాటించాలని, గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేను రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

అనంతరం ఘనపురం మండల కేంద్రంలోని ఎస్సీ ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించారు. ప్రస్తుత భవనం విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందని గుర్తించి, నూతన భవన నిర్మాణానికి త్వరలో ప్రభుత్వ నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు.

### సింగపూర్ ఎక్స్‌పోజర్
## విజిట్‌కు హెచ్‌ఎం లక్ష్మి ఎంపిక



**జడ్చర్ల, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** 2026-27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం చేపట్టిన సింగపూర్ ఎక్స్‌పోజర్ విజిట్‌కు బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్ (గర్ల్స్) ప్రధానోపాధ్యాయిని లక్ష్మి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొన్నారు. సెప్టెంబర్ 12 నుంచి 19 వరకు రాష్ట్రానికి చెందిన 40 మంది ఉపాధ్యాయులు, అధికారుల బృందం సింగపూర్‌లో పర్యటించనుంది. అక్కడి విద్యా విధానాలు, ఆలోచనా శక్తి, నైపుణ్యాల అభివృద్ధి, నిర్బంధ ప్రాథమిక విద్య, ద్విభాషా విధానం, విమర్శనాత్మక ఆలోచన ఆధారిత బోధనను బృందం అధ్యయనం చేయనుంది. లక్ష్మి ఎంపికపై పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## ప్రత్యేక అవసరాల పిల్లల సేవలో నిర్లక్ష్యం వద్దు: జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక



మిగతా 2లో..

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల సంక్షేమంలో అధికారులు, సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పిల్లల సంఖ్య, వారి అవసరాలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సేవలపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రతి చిన్నారికి పెన్షన్ అందుతుందా, పాఠశాలతో అనుసంధానమై ఉన్నారా, ఐఆర్‌పీలు ఇళ్లకు వెళ్లి అవసరమైన సేవలు అందిస్తున్నారా అనే అంశాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పెన్షన్ అందని పిల్లలను గుర్తించి అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించే సదరం, యూడీఐడీ క్యాంపులకు ధ్రువపత్రాలు పొందని పిల్లలను గుర్తించి తీసుకెళ్లి ప్రక్రియ పూర్తి చేయించాలని సూచించారు.

ఇటీవల విద్యాశాఖ ఆధ్వర్యంలో పిల్లలను హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు తీసుకెళ్లినట్లే, ఆసక్తి ఉన్న మరికొంతమంది పిల్లలకు కూడా రెండు వారాల్లో మరోసారి సందర్శన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐఆర్‌పీలు ప్రతి కుటుంబంతో అనుసంధానమై పిల్లలకు అవసరమైన సేవలు అందేలా చూడాలని, జిల్లా విద్యాశాఖ, డీఆర్‌డీఓ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## సర్పంచ్ స్థానంలో భర్త.. 'పెత్తనం'పై చర్చ



**పుల్కల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** పెద్దరెడ్డిపేట గ్రామంలో మహిళా సర్పంచ్ కుమ్మరి అనసూయ స్థానంలో ఆమె భర్త లింగం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుర్చీలో కూర్చోవడం చర్చనీయాంశంగా మారింది. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, కొన్నిచోట్ల ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో భర్తలు పెత్తనం చెలాయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికైన సర్పంచ్ స్వయంగా అధికారిక విధుల్లో పాల్గొనాలని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. మహిళా సాధికారత లక్ష్యం నెరవేరేలా ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులే విధులు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# బీఆర్ఎస్ అరాచకానికి ప్రజలే బుద్ధి చెబుతారు

- దళితులను అవమానిస్తే భారీ మూల్యం తప్పదు
- బీఆర్ఎస్ అరాచకంపై సంగారెడ్డిలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన
- కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరును నిరసిస్తూ సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు సంగారెడ్డి పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రామ్‌నగర్‌లోని జగ్గారెడ్డి నివాసం నుంచి పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నిర్మలా జగ్గారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

**ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ..** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అరాచకం, గూండాయిజానికి పాల్పడ్డారని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇలాంటి ఘటనలు ఎక్కడా జరగలేదని విమర్శించారు.

బీఆర్ఎస్ నేతలు తమకు తామే నెట్టుకుని, పోలీసులపై దాడి చేసి, తిరిగి తామే బాధితులమన్నట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. దళిత వర్గాన్ని అవమానించేలా బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు, చర్యలను రాష్ట్ర ప్రజలంతా గమనించారని పేర్కొన్నారు. దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం బీఆర్ఎస్ పార్టీ కుసంస్కారానికి, అనాగరిక చర్యలకు నిదర్శనమని నిర్మలా జగ్గారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దళితులను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదని, ఇందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిర్మలా జగ్గారెడ్డి హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్మెన్ కూన వనితా సంతోష్,సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, నాయకులు జార్జ్ ,కిరణ్ గౌడ్, సంతోష్ , శ్రీకాంత్ , రామ్ చందర్ నాయక్ , శ్రీకాంత్ రెడ్డి, సందీప్ రెడ్డి,భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎండోమెంట్ కమీషనర్ హనుమంత రావు..



పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): ఎలినో ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. వినాయక చవితిని పురస్కరించుకుని హైదరాబాద్ బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయానికి వచ్చే అర్చకులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఐఐవీ అర్చక సంఘం అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ, కోశాధికారి నందనం హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మహేష్ ఏకగ్రీవం



బెజ్జంకి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో జరిగిన ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభల్లో బెజ్జంకి మండలానికి చెందిన దొంతరవేణి మహేష్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహేష్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

యువత సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి, ప్రతి ఏడాది ఉద్యోగ క్యాలెండర్ అమలు చేయాలని, పోటీ పరీక్షల రుసుములు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గ్రామీణ యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించాలని, మాదకద్రవ్యాల వ్యసనాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయం, యువజన హక్కుల సాధనకు నిరంతరం పోరాడతామని, సిద్దిపేట జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా యువజన ఉద్యమాన్ని బలోపేతం చేస్తానన్నారు.

## అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ముదిరాజుల ముందస్తు అరెస్టు

- బీసీ-బీ నుంచి బీసీ-ఏలో చేర్చాలని డిమాండ్




పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): ముదిరాజులను బీసీ–బీ నుంచి బీసీ–ఏలో చేర్చాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్లేందుకు సిద్ధమైన పెద్ద శంకరంపేట మండల ముదిరాజ్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. అరెస్టులపై ముదిరాజ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

## వినాయకుడి రూపంలో విద్యార్థుల వినూత్న ప్రదర్శన



మెదక్ టౌన్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మెదక్‌లోని గీతా పాఠశాల విద్యార్థులు వినూత్న రీతిలో వేడుకలు నిర్వహించారు. పాఠశాల మైదానంలో విద్యార్థులంతా క్రమశిక్షణతో ఒకచోట చేరి శ్రీ వినాయకుడి ఆకారంలో కూర్చుని అద్భుతమైన ప్రదర్శన నిర్వహించారు. ఏనుగు తల, తొండం, కిరీటం తదితర ఆకృతులు స్పష్టంగా కనిపించేలా విద్యార్థులు సమన్వయంతో ఈ ప్రత్యేక రూపకల్పన చేశారు. విద్యార్థుల ఐక్యత, క్రమశిక్షణ, సృజనాత్మకతకు అద్దం పట్టేలా సాగిన ఈ ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. వినాయక చవితి పండుగ విశిష్టతను తెలియజేస్తూ విద్యార్థులు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు. రవికుమార్,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి



కోహెడ, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ కోహెడ మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో కోహెడ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఆకుల రాములుకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిన సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని కోరారు. విమోచన పోరాట యోధుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాలని అన్నారు. చరిత్రను వక్రీకరించకుండా రాష్ట్రవ్యాప్తంగా అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోహీర్‌లో ఘనంగా 'ఫ్రైడే డ్రై డే'

- డెంగ్యూ, మలేరియా నివారణపై ఇంటింటా అవగాహన
- నీటి నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి: కమిషనర్ శశిధర్
- మున్సిపల్ చైర్‌పర్సన్, యం అశోక్






కోహీర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం. అశోక్, వైస్ చైర్మన్ ఏ.మే హన్నాను జావిద్, మున్సిపల్ కమిషనర్ సి. శశిధర్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో వివిధ వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా వర్షాకాలంలో విజృంభించే డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

**వారానికి ఒకరోజు.. నీటి నిల్వలకు చెక్**

ఎయిర్ కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి బొండాలు, పూల కుండీలు, ఖాళీ డబ్బాలు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా వారానికి ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేసి ఎండబెట్టాలని మున్సిపల్ కమిషనర్ సి. శశిధర్ సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు. ప్రజలు 'ఫ్రైడే డ్రై డే'ను ఒక కార్యక్రమంగా కాకుండా ప్రతి వారం పాటించాల్సిన అలవాటుగా మార్చుకోవాలని సూచించారు.

**వీధి కుక్కల పట్ల అప్రమత్తత అవసరం...**

వీధి కుక్కల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ బృందం సూచించింది. కుక్కలను రెచ్చగొట్టకూడదని, వాటి వెంట పరుగెత్తడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. కుక్క కరిచినట్లయితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య చికిత్స పొందాలని సూచించారు.

**ఇంటింటికీ అవగాహన కరపత్రాలు...**

ఆరోగ్య రక్షణ, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు సంబంధించిన అవగాహన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ప్రజల సహకారంతోనే సీజనల్ వ్యాధులను నియంత్రించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు, ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు




కోహెడ, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కలకొండ రవీందర్‌రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని, అధ్యాపకుల సూచనలు పాటిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని కళాశాలకు రాష్ట్రస్థాయిలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్థానిక సర్పంచ్ బందెల సుజాత-కిషన్ మాట్లాడుతూ కళాశాలకు మంచి పేరుందని, విద్యార్థులు అవకాశాలను వినియోగించుకోవాలని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాఠశాల పక్కనే మోరి.. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమా?

- పిల్లల చదువుల ప్రాంగణం పక్కనే మురుగునీటి కాలువ
- మోరి మార్గం మార్పుపై గ్రామస్తుల అనుమానాలు



**కొండాపూర్, సెప్టెంబర్ 11(జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు ఆనుకొని నూతన మోరి నిర్మాణానికి చేపడుతున్న చర్యలపై గ్రామస్తులు, గ్రామపంచాయతీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాఠశాలకు ఎదురుగా ఉన్న మార్గంలో నిర్మించాల్సిన మోరిని ప్రస్తుతం పాఠశాల వైపునకు మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. పాఠశాల పక్కనే మోరి నిర్మిస్తే మురుగు నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందడంతో పాటు దుర్వాసన వ్యాపించే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మోరి మార్గాన్ని పాఠశాల వైపునకు మార్చడం వెనుక అక్కడి భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం ఉందొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ మోరి 10వ వార్డు పరిధిలో ఉండగా, వార్డు సభ్యుడు ముజీబ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సభ్యులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ మోరి నిర్మాణం చేపట్టడం సరికాదన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని సంబంధిత సహాయ ఇంజినీర్‌తో పాటు ఉన్నతాధికారులు తక్షణమే స్థలాన్ని పరిశీలించాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాల భూముల హద్దులను పరిశీలించి, మోరి నిర్మాణంపై తగిన నిర్ణయం తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

# అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయండి

**కొండపాక, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** సెప్టెంబర్ 17న బైరాన్‌పల్లిలో సీపీఎం సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, ఉమ్మడి కొండపాక మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య పిలుపునిచ్చారు. వెలికట్ట చౌరస్తాలో శుక్రవారం కరపత్రాలు విడుదల చేసి ఆయన మాట్లాడారు. సభకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.
1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వాములు, దొరలు, జాగీర్దారులు, నిజాం పాలనకు వ్యతిరేకంగా కొనసాగిందన్నారు. కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా ప్రజలు పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. ఈ పోరాటంలో 4,500 మంది ప్రాణత్యాగం చేయగా, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని, 8,500 మంది పోరాట యోధులు జైలు శిక్ష అనుభవించారని పేర్కొన్నారు. దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ వంటి ఎందరో వీరుల త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. బైరాన్‌పల్లిలో 96 మంది పోరాటయోధులను ఒకేరోజు హతమార్చిన ఘటనను గుర్తుచేశారు. రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించి కుల, మత ఘర్షణలుగా చిత్రీకరించడం సరికాదన్నారు. ప్రజల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని కోరారు. నేటి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 17న వెలికట్ట చౌరస్తా నుంచి నిర్వహించే బైక్ ర్యాలీలో, బైరాన్‌పల్లి అమరవీరుల సభలో సీపీఎం కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

# మునిపల్లి మండల కేంద్రానికి పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయం

- మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి



**మునిపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మునిపల్లి మండల కేంద్రంలో పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.
గతంలో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ ప్రధాన కార్యాలయం పుల్కల్‌లో ఉండగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో కార్యాలయాన్ని మునిపల్లి మండల కేంద్రానికి మార్చినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. మునిపల్లి, రాయికోడ్ మండలాల ప్రజలకు పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన పనులు మరింత సులభతరం కానున్నాయి. ఇకపై ఆయా మండలాల ప్రజలు సబ్ డివిజన్ కార్యాలయానికి సంబంధించిన సేవల కోసం మునిపల్లి కేంద్రంలోని కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.
కార్యాలయాన్ని మునిపల్లికి మంజూరు చేయడంపై మునిపల్లి, రాయికోడ్ మండలాల ప్రజల తరపున వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మునిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్ కుమార్ మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు

## 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేందుకు 'ఇంటింటికి ఇందిరమ్మ కుట్టుమిషన్' పథకం కింద ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. అర్హులైన మహిళలు ఈ నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
18 నుంచి 55 ఏళ్లలోపు వయస్సు కలిగిన బీసీ మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. నిరుద్యోగులు, నిరుపేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, అనాథలు, కుట్టు శిక్షణ ధ్రువపత్రం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలి. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుంది. కులం, ఆదాయం, నివాసం, ఆధార్, విద్యార్హత, రేషన్‌కార్డు, కుట్టు శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలు సమర్పించాలి. గ్రామీణ ప్రాంతాల వారు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతాల వారు సంబంధిత మున్సిపల్ కమిషనర్‌కు ఈ నెల 15లోగా దరఖాస్తు సమర్పించాలి. 2023-24లో బీసీ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక సహాయం పొందిన వారు అర్హులు కాదని కలెక్టర్ స్పష్టం చేశారు.

## 18 ఏళ్లు నిండిన వారు ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి: తహసీల్దార్ మాలతి



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ నెల 12, 13 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మాలతి తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఫారం-6 ద్వారా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.
ఓటరు జాబితాలో అనర్హుల పేర్ల తొలగింపునకు ఫారం-7, వివరాల్లో మార్పులు, సవరణలకు ఫారం-8 ద్వారా బీఎల్‌ఓలను సంప్రదించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయడంతోపాటు, మార్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలే మేలు

- కమిషనర్ సాయికుమార్



**నర్సాపూర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి, పర్యావరణహిత పదార్థాలతో తయారైన వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ సూచించారు. నర్సాపూర్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాచునూరి లక్ష్మిరాజు యాదవ్ హాజరయ్యారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారైన విగ్రహాల వల్ల నీటి కాలుష్యం ఏర్పడుతుందని, మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు జరుగుతుందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పాఠశాల ప్రిన్సిపల్, మున్సిపల్ సిబ్బంది, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడా ప్రతిభకు ఎస్ జి ఎఫ్ వేదిక

- జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

**పుల్కల్,సెప్టెంబర్11 (జనంసాక్షి):** మండల స్థాయి ఎస్ జి ఎఫ్ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్ పోటీలు టీజీడబ్ల్యూఆర్ ఈఎస్ సింగూర్ పాఠశాలలో మూడు రోజులపాటు ఉత్సాహంగా నిర్వహించారు. మండల విద్యాధికారి వి.శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఎస్ జి ఎఫ్ పోటీలు దోహదపడతాయని తెలిపారు. క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పుల్కల్ మండలానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్దారెడ్డిపేట సర్పంచి అను సుజ లింగయ్య, సింగూర్ సర్పంచి నంది కంటి శ్రీనివాస్, బస్వాపూర్ సర్పంచి భూం రెడ్డి, ముద్దాయిపేట సర్పంచి లక్ష్మిపతి ఈటి లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ముగిసిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు





**మునిపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** మునిపల్లి మండలం లింగంపల్లిలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ఉత్సాహభరితంగా ముగిశాయి. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ భీమ్‌సింగ్ అధ్యక్షత వహించగా, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ ఇర్ఫాన్ పటేల్, టీజీఆర్ఎస్ లింగంపల్లి ప్రిన్సిపాల్ చైతన్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు కీలకమని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. ఎంఈఓ భీమ్‌సింగ్ మాట్లాడుతూ మండల క్రీడాకారులు జిల్లా స్థాయిలోనూ ప్రతిభ చాటి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కబడ్డీ అండర్-17, అండర్-14 బాలికల విభాగాల్లో కేజీబీవీ తాటిపల్లి, బాలుర విభాగాల్లో టీజీఆర్ఎస్ లింగంపల్లి ప్రథమ స్థానాలు సాధించాయి. ఖో-ఖో అండర్-17, అండర్-14 బాలికల విభాగాల్లో జెడ్పీహెచ్ఎస్ కంకోల్, బాలుర విభాగాల్లో టీజీఆర్ఎస్ లింగంపల్లి విజేతలుగా నిలిచాయి. వాలీబాల్ అండర్-17, అండర్-14 బాలికల విభాగాల్లో జెడ్పీహెచ్ఎస్ కంకోల్, బాలుర విభాగాల్లో టీజీఆర్ఎస్ లింగంపల్లి ప్రథమ స్థానాలు సాధించాయి. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎండిపోతున్న పంటలు.. అన్నదాతకు కన్నీరు!



**కల్హేర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** ఎలినోవా ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో పంటలు ఎండిపోతున్నాయి. సాగునీటి కోసం రైతులు ఎదురుచూస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న ఇందిరానగర్, కృష్ణాపూర్, కల్హేర్, ఖానాపూర్ గ్రామాల రైతులు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**కాలువల్లో పూడికతో నీటి ప్రవాహానికి ఆటంకం...**

నల్లవాగు ప్రాజెక్టు కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహం సక్రమంగా లేక పంట పొలాలకు నీరు చేరడం లేదని రైతులు చెబుతున్నారు. నెల రోజుల క్రితం నాటిన వరి పంటకు ప్రస్తుతం నీరు అందక పొలాలు బీటలు వారుతున్నాయి. పచ్చగా ఉండాల్సిన వరి మొక్కలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

**అడుగంటిన భూగర్భ జలాలు...**

పంటలను కాపాడుకునేందుకు కొందరు రైతులు బోర్లను ఆశ్రయిస్తున్నప్పటికీ భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వాటి ద్వారా కూడా పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని తెలిపారు. దీంతో వేలాది ఎకరాల్లో సాగు చేసిన వరి పంటకు నీటి ఎద్దడి ఏర్పడింది.

**పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి...**

వరి సాగుకు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు పంట చేతికందకపోతే తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని



వాపోతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, దున్నకాలు, కూలీల కోసం చేసిన ఖర్చులు వృథా అయ్యే ప్రమాదం ఉందన్నారు.

**అధికారులు తక్షణం స్పందించాలి...**

నల్లవాగు కాలువల్లో పూడిక తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను వినియోగించి పంటలను కాపాడేందుకు అత్యవసర చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని, లేకపోతే అప్పుల భారం మరింత పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# విత్తన గణపతి పూజిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**కొండపాక, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** గ్రీన్ ఇండియా ఛాలెంజ్లో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశంతో విత్తన గణపతి ప్రతిమల పంపిణీ కొండపాక మండల హరితసేన కోఆర్డినేటర్లు మహిపాల్ రెడ్డి, దోమల దుర్గాప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రతిమలను ప్రభుత్వ అధికారులు కొండపాక మండల తాసిల్దార్ మల్లికార్జున్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు నూనె కుమార్, మాజీ ఎంపీ పీ సుగుణ దుర్గయ్య, టోల్‌గేట్ మేనేజర్ అశోక్, సిద్దిపేట జిల్లా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెసిడెంట్ టి.న్యూస్ రంగాచారి, సిద్దిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, మాజీ మంత్రి హరీష్‌రావు కార్యాలయ వ్యక్తిగత సహాయకులు ప్రవీణ్‌కి, BRS నాయకులు జువ్వల కనకరాజు, రంగదాంపల్లి శ్రీనివాస్‌కు విత్తన గణపతి ప్రతిమలను నూనెకుమార్ మాట్లాడుతూ అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ ఎస్ నాయకులు అంబటి బాలచందర్ బిఆర్ఆర్ ఫౌండేషన్ ఫౌండేషన్ బొంగు రాజేందర్ రెడ్డి పాండుగౌడ్ తదితరుల పాల్గొన్నారు.

# సేవా సంకల్ప అభియాన్‌ను విజయవంతం చేయాలి

- సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి

**బెజ్జంకి, సెప్టెంబర్ 11(జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ బెజ్జంకి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు కొలిపాక రాజు నేతృత్వంలో సేవా సంకల్ప అభియాన్ సన్నాహక సమావేశం నిర్వహించారు.అనంతరం సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.సన్నాహక సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కర చారి,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి,సేవా సంకల్ప అభియాన్ జిల్లా సహ కన్వీనర్ జగదీశ్వర చారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రంగు భాస్క చారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని,అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు,ఆరోగ్య అవగాహన,పర్యావరణ పరిరక్షణ,పరిశుభ్రత,పేదలకు సహాయం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం కొలిపాక రాజు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం,రజాకార్ల దురాగతాలను ఎదుర్కొని



సాధించిన స్వేచ్ఛా చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.సెప్టెంబర్ 17ను ఎలాంటి రాజకీయాలకు అతీతంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించి,అమరవీరులకు ఘన నివాళులు అర్పించాలని డిమాండ్ చేశారు. పోరాట వీరుల త్యాగాలను స్మరించుకునేలా రాష్ట్రవ్యాప్తంగా అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బుర్ర మల్లేశం గౌడ్,గుగ్గిళ్ల సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్య,మండల నాయకులు సంఘ రవి,గైని రాజు,దొమ్మాటి రాములు,వడ్లూరు సాయిలు, గంప రవికుమార్, జెల్లా అనిల్,బెజ్జంకి రాజమల్లు, బుర్ర కిషన్, గాండ్ల శీను,వడ్లూరు శ్రీనివాస్, లోనే నర్సింగం, ధోనే అంజన్న, బోనగం నరేష్,చంద్రయ్య,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ గణన చేసి ఓబీసీలో చేర్చాలి




**మెదక్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించి, బీసీ గణనను ఓబీసీలో చేర్చాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట బీసీ సంఘం ఆధ్వర్యంలో ధర్మపోరాట దీక్ష నిర్వహించారు. జనాభాలో అధికంగా ఉన్న బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు మాత్రమే కల్పించడం అన్యాయమన్నారు. మేమెంతో-మాకంత రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే బీసీలంతా ఐక్యమై పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ ఎంతో కీలకం...

- విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి..
- కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి..
- మండల విద్యాధికారి వి.శేఖర్...



**పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ ఎంతో కీలకమని.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పెద్ద శంకరంపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి. మండల విద్యాధికారి వి శేఖర్ లు అన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రెషర్స్ డే సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో లక్ష్యం పెట్టుకొని ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో మంచి కోర్సులను ఎంచుకొని అత్యుత్తమ స్థానాలకు విద్యార్థులు ఎదగాలన్నారు.. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు అనంతరాజు శర్మ. ప్రభాకర్, మల్లేశం, రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

# కోహిర్‌లో ముగిసిన 70వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

**కోహిర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలస్థాయి 70వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు రెండు రోజులపాటు ఉత్సాహభరితంగా నిర్వహించి ముగించారు. మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటారు. తొలిరోజు బాలికలకు, రెండో రోజు బాలురకు పోటీలు నిర్వహించారు. బాలుర పోటీలను కోహిర్ ఎస్ఐ నరేష్‌కుమార్ ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, శారీరక దృఢత్వంతోనే జీవితంలో విజయాలు సాధించవచ్చని ఆయన అన్నారు. అనంతరం పోటీలను తిలకించి క్రీడాకారులను అభినందించారు.

విజేతలకు ఎంఈఓ మహమ్మద్ జాకీర్ హుస్సేన్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కబడ్డీ అండర్-14లో దిగ్వాల్ జెడ్‌పీహెచ్‌ఎస్, అండర్-17లో పిచర్యాగడి జెడ్‌పీహెచ్‌ఎస్ ప్రథమ స్థానాలు సాధించాయి. ఖోఖో అండర్-14లో



కవేలి, అండర్-17లో పిచర్యాగడి జెడ్‌పీహెచ్‌ఎస్ విజేతలుగా నిలిచాయి. బాలికల వాలీబాల్ అండర్-14, అండర్-17 విభాగాల్లో కవేలి జెడ్‌పీహెచ్‌ఎస్ ప్రథమ స్థానాలు సాధించగా, అండర్-17లో దిగ్వాల్ జెడ్‌పీహెచ్‌ఎస్ ద్వితీయ స్థానంలో నిలిచింది. క్రీడా పోటీలను పీఈటీలు సురేఖ, రేవతి, దినాకర్, క్రాంతి సమన్వయంతో నిర్వహించారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు క్రీడాకారులను అభినందించారు. ఉపాధ్యాయుల సమన్వయం, సహకారంతో పోటీలు విజయవంతంగా ముగిశాయని నిర్వాహకులు తెలిపారు.

# ఇంటిగ్రేటెడ్ పాస్టర్ అసోసియేషన్ 8వ వార్షికోత్సవం




**కొండాపూర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** ఇంటిగ్రేటెడ్ పాస్టర్ అసోసియేషన్ సంగారెడ్డి ఆధ్వర్యంలో 8వ వార్షికోత్సవ స్తుతి కూడికను మల్కాపూర్‌లోని సీ.సీ.డీ.ఎల్. మినిస్ట్రీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాస్టర్ పి. భాస్కర్, ఉపాధ్యక్షుడిగా ఎం. జోసెఫ్, కార్యదర్శిగా బీ. ఏలియా కుమార్, ఉపకార్యదర్శిగా టీ. అనిల్, కోశాధికారిగా ఏ. ప్రసన్న కుమార్ ఎన్నికయ్యారు. సభ్యులుగా సీహెచ్. షద్రక్, జి. కిషన్, సలహాదారులుగా జి. దావీదు, సి. డానియల్, జి. సునీల్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం పాస్టర్ల ఐక్యత, అసోసియేషన్ అభివృద్ధి, క్రైస్తవ సేవల విస్తరణకు కృషి చేస్తామని తెలిపింది. కార్యక్రమంలో ప్రార్థనలు, స్తుతి ఆరాధనలు, వాక్య సందేశాలు నిర్వహించారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి బ్యాచ్ మెంట్స్ ఔదార్యం

- ఆదుకున్న అధికారులు




**శివ్వంపేట సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, అధికారుల ఆదేశాలను పాటిస్తూ, శివ్వంపేట పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహించే మహిపాల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. అయితే మృతుడి కుటుంబ సభ్యులకు మహిపాల్ బ్యాచ్ మేట్స్ అలాగే ఇతర అధికారులు 3,21,000 రూపాయలు, అదే విధంగా శివంపేట పోలీస్ స్టేషన్ తరఫున ఒక లక్షా రూపాయలు, ఇలా మొత్తం కలిపి 4, 21,000 లక్షల రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ చిత్తశుద్ధి తో పనిచేసే పోలీసులు రోడ్డు ప్రమాదంలో అర్ధరాంతంగా చనిపోవడం ఎంతో బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్, తూప్రాన్ సిఐ వెంకటరాజు గౌడ్, శివంపేట ఎస్ ఐ మధుకర్ రెడ్డి, ఇతర పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో వాహన భద్రత క్యూఆర్ స్టిక్కర్ ఆవిష్కరణ

• డి ఎస్పి సైదా నాయక్




**జహీరాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** వాహనదారుల భద్రత, అత్యవసర సమయాల్లో సమాచార చేరవేత లక్ష్యంగా రూపొందించిన ఎన్‌జీఎఫ్ 132 సంపర్క బ్రోచర్, వాహన భద్రత క్యూఆర్ స్టిక్కర్‌ను జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, టౌన్ సీఐ రవి, ఎస్ఐ లవకుమార్, రూరల్ ఎస్ఐ రాజేందర్‌రెడ్డి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌జీఎఫ్ 132 సిబ్బంది మాట్లాడుతూ.. క్యూఆర్ స్టిక్కర్ ద్వారా అత్యవసర సమయంలో వాహన యజమానికి సులభంగా సమాచారం చేరవేయవచ్చన్నారు. అలాగే వ్యక్తిగత ఫోన్ నంబర్ గోప్యతను కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వాహన భద్రతతో పాటు అత్యవసర సమాచారం చేరవేత, పార్కింగ్ సమస్యల పరిష్కారానికి ఈ విధానం ఉపయోగకరంగా ఉంటుందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పంపిణీదారుల సిబ్బంది నవీన్ వర్మ పేర్కొన్నారు.

## కోరం లేకుండానే నంగునూర్ మండల సర్వసభ్య సమావేశం

• అధికారులపై చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈఓకు సర్పంచుల ఫిర్యాదు




**నంగునూర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** కోరం లేకుండా మండల సర్వసభ్య సమావేశం నిర్వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు జెడ్పీ సీఈవోకు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం జరిగిన సమావేశాన్ని మెజార్టీ సభ్యులు బహిష్కరించడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి శివరంజని ప్రకటించారని తెలిపారు. అయితే సభ్యులు వెళ్లిపోయిన అనంతరం కాంగ్రెస్ నాయకుల ఆదేశాలతో కనీస కోరం లేకుండానే మళ్లీ సమావేశం నిర్వహించారని ఆరోపించారు. ప్రజాప్రతినిధుల హక్కులకు భంగం కలిగించేలా నిబంధనలకు విరుద్ధంగా సభ నిర్వహించిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, సర్పంచులు నరేష్, నరేష్‌రెడ్డి, సాయిలు, నాయకులు రమేష్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

## విద్యుత్ సమస్యపై అధికారుల నిర్లక్ష్యం ....రైతుల ఆందోళన



**ఇటిక్యాల,సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** లక్షల రూపాయలతో పంటలకు పెట్టుబడి చేస్తున్న రైతులకు విద్యుత్ సరఫరాలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని సాతర్ల గ్రామ 33 కేవి సబ్ స్టేషన్ వద్ద సమయపాలన లేని విద్యుత్ సరఫరాపై రైతును ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరిస్తూ శుక్రవారం సాతర్ల సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో లేదో తెలియక రైతుల పొలం వద్దనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు. విద్యుత్ సమస్యపై శాశ్వత పరిష్కారం చూపకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని రైతులు అధికారులను హెచ్చరించారు.

## నిమజ్జన ప్రాంతాల్లో నీటిమట్టాల పరిశీలన





**కృష్ణ, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతోంది. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్, రెవెన్యూ అధికారులు, ఎస్ఐ నవీన్ తదితరులు కృష్ణ నది పరిసరాలు, చెరువుల వద్ద నీటిమట్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం కొన్ని చెరువుల్లో నీటిమట్టం తక్కువగా ఉండటంతో పెద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనానికి కృష్ణా నది లేదా ఇతర ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించారు.

నిమజ్జన ప్రాంతాల్లో నీటి లోతు, నీటి పరిస్థితులు, భద్రత, లైటింగ్, పారిశుద్ధ్యం, క్రేన్ల ఏర్పాటు, బ్యారికేడింగ్, వాహనాల రాకపోకలు, పార్కింగ్, ప్రజల ప్రవేశ-నిష్క్రమణ మార్గాలను అధికారులు పరిశీలించారు. రాత్రివేళల్లోనూ ఇబ్బందులు లేకుండా తగిన విద్యుత్, లైటింగ్ సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను సూచించారు. చెరువు పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్ మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతాలపై క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేసి ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కృష్ణా నది లేదా చెరువుల్లో సురక్షితమైన లోతైన ప్రాంతాలను గుర్తించి నిమజ్జనానికి అనువుగా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ఆర్ అండ్‌బీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి: సుధాకర్ రెడ్డి



**మునిపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి అన్నారు. మునిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత యూనిఫామ్, షూ, బెల్ట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుధాకర్ రెడ్డితో పాటు సర్పంచ్ రాజగోని సౌందర్య నరేందర్ గౌడ్, ఎంఈఓ భీమ్ సింగ్ పాల్గొన్నారు. ప్రభుత్వం ఉచిత విద్య, యూనిఫామ్, షూ, బెల్ట్, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఫర్నిచర్ వంటి సదుపాయాలు కల్పిస్తోందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల కృషితో ఈ విద్యా సంవత్సరంలో 50 మంది కొత్తగా చేరడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయురాలు మధురిమ మాట్లాడుతూ గ్రామస్థులు, తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందన్నారు. 'రూమ్ టు రీడ్' ప్రతినిధి సంధ్య పఠన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?

• జీఓ 97, శక్తి స్కీమ్ రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థుల డిమాండ్
• 161వ జాతీయ రహదారిపై ధర్నా.. సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం



**చౌటకూర్,సెప్టెంబర్ 11(జనంసాక్షి):** జీఓ నంబర్ 97తో పాటు శక్తి స్కీమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళన చేపట్టారు.సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేట వద్ద 161వ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టూడెంట్ పవర్.. నేషన్ పవర్ అంటూ నినదించారు. ప్రభుత్వ నిర్ణయాలతో తమ విద్యా భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దిష్టిబొమ్మ దహనానికి యత్నం శక్తి స్కీమ్‌ను ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు విద్యార్థులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు,పోలీసుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. న్యూవోన్నపురం, అందోల్ పాలిటెక్నిక్ కళాశాలల వద్ద కూడా పోలీసులు మోహరించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు తమకుందని విద్యార్థులు పేర్కొన్నారు.

## రైతుల కరెంటు కష్టాలు - దరూర్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా



**దరూరు, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** నాణ్యతలేని విద్యుత్ సరఫరాతో మోటార్లు కాలిపోతున్నాయని, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆరోపిస్తూ దరూర్ మండల కేంద్రంలోని 33/11 కెవి సబ్ స్టేషన్ వద్ద రైతులు రోడ్డుపై ధర్నా చేపట్టారు.రైతులకు మద్దతుగా బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి ధర్నాలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలో వ్యవసాయ బోర్లకు సరైన విద్యుత్ అందక పంటలకు నీరు అందడం లేదని, తక్కువ వోల్టేజ్, తరచూ అంతరాయాలు, కాలిన ట్రాన్స్ ఫార్మర్లను మార్చకపోవడంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లాల్సి రావడంతో ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని, మోటార్లు కాలిపోయి అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 24 గంటలు కాదు కదా, ప్రకటించిన 12 గంటల విద్యుత్ కూడా ఇవ్వడం లేదని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం ఎస్ఈ అబ్దుల్ కరీం, డీఈ రవిప్రసాద్ రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు దరూర్ కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



**ఎర్రవల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా టీఆర్‌వీకే సమన్వయకర్త డా. పి. అర్చన, ఆర్ఏఆర్ఎస్ పాలెం శాస్త్రవేత్తలు ఏ. శ్రీరామ్, ఎం. మమతతో కలిసి ఎర్రవల్లి మండలంలోని కోదండపురం, వేముల, ఉండవల్లి మండలంలోని తక్కశిల, మరుమునగల గ్రామాల్లో క్షేత్ర పర్యటన నిర్వహించారు. పత్తి, మిరప, కంది, మొక్కజొన్న, ఉల్లి తదితర పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.

పత్తిలో రసం పీల్చే పురుగులు, తేమ ఒత్తిడిని గుర్తించి క్రమం తప్పకుండా పంటను పరిశీలించాలని, అందుబాటులో ఉన్న నీటితో నీటిపారుదల చేయాలని సూచించారు. అధిక నత్రజని ఎరువులు వాడొద్దని తెలిపారు. మిరపలో త్రిప్స్ నివారణకు నీలి జిగురు పత్రాలు ఏర్పాటు చేయాలని, వైరస్ సోకిన మొక్కలను తొలగించాలని సూచించారు.

కందిలో స్టెరిలిటీ మోసాయిక్ వ్యాధి, హెలికోవర్పా పురుగు నివారణకు బాధిత మొక్కలను తొలగించడం, ఫెరోమోన్ ట్రాప్స్, పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరమైనప్పుడు సిఫార్సు చేసిన సస్యరక్షణ మందులు మాత్రమే వినియోగించాలని సూచించారు. మొక్కజొన్నలో పూత దశలో నీటి కొరతతో దెబ్బతిన్న పంటకు పరిస్థితిని బట్టి వెంటనే నీటిపారుదల చేయాలని చెప్పారు. పూర్తిగా ఎండిన పంటలో అదనపు పెట్టుబడులు పెట్టే ముందు పరిస్థితిని అంచనా వేయాలని సూచించారు. ఉల్లిలో నేల తేమను కాపాడుతూ తెగుళ్లను పరిశీలించాలని తెలిపారు. రైతులు సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం) పద్ధతులు పాటిస్తూ, పురుగు ఉధృతిని బట్టి మాత్రమే పురుగుమందులు వినియోగించాలని శాస్త్రవేత్తలు సూచించారు. కార్యక్రమంలో ఎంఏవోలు, ఏఈవోలు, 10 మంది రైతులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో మట్టి గణపతుల పంపిణీ

• మున్సిపల్ చైర్ పర్సన్ వనిత సంతోష్



సంగారెడ్డి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా సంగారెడ్డి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. మట్టి విగ్రహాల వినియోగంతో పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు, నిమజ్జనం అనంతరం చెరువుల్లోని జలచరాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉంటాయని తెలిపారు. పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు. అన్నదాన కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా ఇస్తారాకు లేదా స్టీల్ ప్లేట్లను వినియోగించాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,వార్డు కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల దిష్టిబొమ్మలు దహనం



చిన్న శంకరంపేట, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్ నాయక్ ఆధ్వర్యంలో చేగుంట-మెదక్ రహదారి పై నిరసన చేపట్టారు. ఎర్రవల్లి కేసీఆర్ ఫామ్ హౌస్‌కు దళితులు వెళ్లిన అనంతరం పసుపు నీటితో శుద్ధిచేయడం దళితులను అవమానించడమేనని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. దళితుడిని సీఎం చేస్తానని చెప్పిన కేసీఆర్ వైఖరి విరుద్ధంగా ఉందని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రమణ, సర్పంచులు కంజర్ల చంద్రశేఖర్, నాయిని ప్రవీణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు డ్రై డే ఫ్రైడే కార్యక్రమం



పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): పెద్ద శంకరంపేట మండలంలోని చీలపల్లి గ్రామంలో శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నవ్య నిర్వహించారు. గ్రామంలో దోమల వ్యాప్తిని అరికట్టడంతో పాటు ప్రజలకు ఆరోగ్యం పై అవగాహన కల్పించేందుకు గ్రామంలోని వీధులు, కాలనీలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల నివారణకు మందును పిచికారి చేయాలని సూచించారు.వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు ఎక్కువగా వృద్ధి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతను పాటించడం ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని నియంత్రించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చిలపల్లి సర్పంచ్ కవిత ప్రశాంత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్, మండల వైద్యాధికారి షర్ఫుద్దీన్, వైద్య సిబ్బంది వెంకటేశం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

# పేదలకు సన్న బియ్యం ఘనత కాంగ్రెస్‌దే



మునిపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): రేషన్ కార్డు ఉన్న నిరుపేదలందరికీ సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఏఎంసీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మునిపల్లి మండలం పోల్కంపల్లి గ్రామంలో శుక్రవారం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో పేద లందరికీ సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. పేదలు ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, సర్పంచ్ వీరేశం, ఉపసర్పంచ్ ఆనంద్, వార్డు సభ్యులు, నాయకులు మల్లన్న పటేల్, టీ. సుధాకర్, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫెయిలాథాన్‌తో వైఫల్యాల నుంచి విజయ పాఠాలు




నర్సాపూర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): వైఫల్యాలకు భయపడకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకుని సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగేందుకు విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో బీవీఆర్ఐటీలో 24 గంటల 'ఫెయిలాథాన్' నిర్వహించారు. నాలుగో ఎడిషన్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు 40 బృందాలుగా పాల్గొన్నారు. వాస్తవ సమస్యలను గుర్తించి వినూత్న పరిష్కారాలను రూపొందించారు. శుక్రవారం ఈ సందర్భంగా బీవీఆర్ఐటీ ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే మాట్లాడుతూ.. వైఫల్యాన్ని అడ్డంకిగా కాకుండా నేర్చుకునే అవకాశంగా చూడాలని విద్యార్థులకు సూచించారు. బీఎస్అండ్‌హెచ్ విభాగాధిపతి డా. బి. మృణాలిని శశాంక మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సమస్య పరిష్కార నైపుణ్యం, సృజనాత్మక ఆలోచన, ప్రయోగాత్మక దృక్పథాన్ని పెంపొందించడమే ఫెయిలాథాన్ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు, ఐఐసీ సమన్వయకర్తలు, బాపిరాజు,ఎవో సురేష్, మార్గదర్శకులు తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకి యువ క్రికెటర్ సాత్విక్‌శర్మ శతకం



బెజ్జంకి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): బెజ్జంకి మండలానికి చెందిన యువ క్రికెటర్ సాత్విక్ శర్మ అండర్-16 స్కూల్ గేమ్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచాడు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో కీసర లెజెండ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో నీరజ్ పబ్లిక్ స్కూల్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో సాత్విక్ 120 పరుగులతో శతకం సాధించాడు. ధాటిగా బ్యాటింగ్ చేస్తూ ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొని జట్టుకు భారీ స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించాడు.
చేపూరి గోపి తనయుడైన సాత్విక్ చిన్న వయసులోనే ప్రతిభ చాటడంతో బెజ్జంకి క్రీడాకారులు, యువత, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షిస్తూ సాత్విక్‌ను అభినందించారు.

# విద్యుత్ కోతలకు నిరసనగా రైతుల ధర్నా



నంగునూరు, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని నంగునూరు మండల రైతులు ఆందోళనకు దిగారు. సిద్దిపేట-హనుమకొండ జాతీయ రహదారిపై రాంపూర్ చౌరస్తా వద్ద శుక్రవారం బైఠాయించి రహదారి నిర్బంధం చేపట్టారు. రోజుకు కనీసం 8 గంటలు కూడా కరెంట్ అందడం లేదని, తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో త్రీ ఫేజ్ విద్యుత్ ఇవ్వడం లేదని తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన త్రీ ఫేజ్ విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రాజగోపాలపేట ఎస్సై వివేక్ పోలీసులతో కలిసి రైతులను నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.

## అక్కినపల్లి ఉపాధ్యాయురాలి

# డిప్యూటేషన్ రద్దు చేయాలి



నంగునూరు, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): అక్కినపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేసి తిరిగి అదే పాఠశాలకు కేటాయించాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల స్పెషల్ ఆఫీసర్ శివరంజనికి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల కొరతతో 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల చదువుకు తీవ్ర ఆటంకం కలుగుతోందని తెలిపారు. గతంలో ఉపాధ్యాయులు సెలవులో ఉన్నప్పుడు తామే వాలంటీర్లను ఏర్పాటు చేసి పాఠశాలను నడిపించామని గుర్తుచేశారు. డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయురాలిని వెంటనే తిరిగి కేటాయించాలని, సాధ్యం కాకపోతే అర్హత కలిగిన మరో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. అధికారులు పాఠశాలను పరిశీలించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# మల్లేశంకి గ్లోబల్ బ్రూస్లీ అవార్డు



చేర్యాల, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): చేర్యాల పట్టణానికి చెందిన చింతల మల్లేశ కి గ్లోబల్ ఐకాన్ ఇంటర్నేషనల్ బ్రూస్లీ అవార్డు రావడం పట్ల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు.
భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గద్దల మహేందర్, తాడెం రమేష్, సొంటె విక్రం, ఇప్పకాయల సంజీవులు పాల్గొన్నారు.

# తూతూమంత్రంగా నంగునూరు మండల సర్వసభ్య సమావేశం







నంగునూరు, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): నంగునూరు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ శివరంజని, ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే బీఆర్ఎస్‌కు చెందిన 12 మంది సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు సమావేశాన్ని బహిష్కరించారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదని, గ్రామాల్లో తీవ్ర విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతులకు నాణ్యమైన కరెంట్ అందించాలని డిమాండ్ చేస్తూ స్పెషల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.
బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు వెళ్లిపోయిన అనంతరం మిగతా ముగ్గురు సర్పంచులు, అధికారులతో సమావేశం కొనసాగించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. కోరం సభ్యులు లేకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి, సర్పంచుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు శివరంజని ప్రకటించారు. అయితే అనంతరం ముగ్గురు సర్పంచులతో సమావేశం నిర్వహించడంపై అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి.
ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తే సహించేది లేదని ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి అన్నారు. గ్రామ సమస్యలను సమావేశంలో ప్రస్తావిస్తేనే పరిష్కారం లభిస్తుందని, బహిష్కరించడం వల్ల ప్రయోజనం లేదన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. మండలంలోని సమస్యలను ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

## నేడు శివ్వంపేటలో కాంగ్రెస్ నిరసన హాజరు కానున్న రాజిరెడ్డి



శివ్వంపేట, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): ఈ నెల 12 న ఉదయం 10 గంటలకు రాజన్న ఫౌండేషన్ ద్వారా గర్భిణీ స్త్రీలకు ఉచిత న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజి రెడ్డి రానున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత పులిమామిడి నవీన్ గుప్తా శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజిరెడ్డి పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గర్భిణీ స్త్రీలకు ఉచిత న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగిన తర్వాత వెంటనే భారత రాష్ట్ర సమితి విధానాలకు, ఆ పార్టీ నాయకులు ఎస్సీ, ఎస్టీల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా శనివారం నిరసన చేపట్టడం జరుగుతుందనీ నవీన్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్.గుండయ్య, కార్యదర్శి ఈర్ల భాస్కర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవికి వినతిపత్రం అందజేశారు. 24 గంటల వైద్య సేవలందించే పీహెచ్‌సీల్లో ప్రసూతి సేవలకు అనుగుణంగా మూడు షిఫ్టుల్లో నర్సింగ్ సిబ్బందిని నియమించాలని కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 53 నర్సింగ్ అధికారి పోస్టులను భర్తీ చేయాలని, లేనిపక్షంలో 24 గంటల కేంద్రాలను 12 గంటల కేంద్రాలుగా మార్చాలని సూచించారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, దస్త్రాలను సకాలంలో పరిష్కరించాలని కోరారు. జహీరాబాద్ డివిజన్‌లో మహిళా ఆరోగ్య కార్యకర్తలకు పెండింగ్‌లో ఉన్న అదనపు ఇంటి అద్దె భత్యం బిల్లులు చెల్లించాలని, పట్టణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తల కొరతను తీర్చాలని, ఖాళీ సహాయక సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపకేంద్రాల్లో మిగిలిన నిధులను సిబ్బంది చేసిన ఖర్చులకు చెల్లించాలని కోరారు. పారావైద్య సిబ్బందికి ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని, మహిళా ఆరోగ్య కార్యకర్తల పనిభారం తగ్గించి కొత్త పరికరాలు, సిమ్ కార్డులు, రోజువారీ 3జీబీ డేటా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపకేంద్రాల అభివృద్ధి కమిటీల్లో మహిళా, పురుష ఆరోగ్య కార్యకర్తలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. గత కార్యక్రమాల బకాయిలు, ఇతర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, 2023లో క్రమబద్ధీకరించిన పురుష ఆరోగ్య కార్యకర్తలకు మూడో వార్షిక గ్రేడ్ వేతన పెంపు మంజూరు చేయాలని కోరారు. గతంలో సమర్పించిన వినతిపత్రాల్లో పరిష్కారం కాని సమస్యలపై ఐఎన్‌టీయూసీ జిల్లా కమిటీతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

# కాడాస్ట్రల్ రీ-సర్వే పనులను గడువులోగా పూర్తి చేయాలి

- 10 గ్రామాల్లో 13 వేల ఎకరాల్లో రీ-సర్వే పూర్తి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): జిల్లాలో కొనసాగుతున్న కాడాస్ట్రల్ రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా అత్యంత ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రీ-సర్వే పురోగతిని ఆమె పరిశీలించారు. మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 10 గ్రామాల్లో 13 వేల ఎకరాల విస్తీర్ణంలో రీ-సర్వే ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పనులు చేపట్టాలని సూచించారు. సర్వే బృందాల రోజువారీ పనితీరు, ప్రతి బృందం సాధిస్తున్న పురోగతి, రోజువారీగా పూర్తవుతున్న విస్తీర్ణంపై అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ రికార్డులను శాస్త్రీయంగా, పారదర్శకంగా రూపొందించేందుకు కాడాస్ట్రల్ రీ-సర్వే ఎంతో కీలకమని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, ఆర్డీవోలు రమాదేవి, రామకృష్ణ, బావయ్య, సంబంధిత తహసీల్దార్లు, సర్వేయర్లు, అధికారులు పాల్గొన్నారు.

## కాజ్ వే నిధులు మంజూరు పై ప్రజలు ఆనందోత్సవాలతో పాలభిషేకం

- ఇరు గ్రామాల ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది
- మాజీ సర్పంచ్ చెప్యాల శ్రీనివాస్ గౌడ్



బెజ్జంకి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామం– కోహెడ మండలం విజయపల్లి గ్రామాల మధ్యలో– లెవెల్ కాజ్‌వే నిర్మాణానికి రూ.1.75 కోట్ల నిధులు మంజూరు కావడంతో గుగ్గిళ్ల గ్రామ రైతులు,గీత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.నిధులు మంజూరు చేసినందుకు గుగ్గిళ్లలో మాజీ సర్పంచ్, మాజీ మండల అధ్యక్షుడు చెప్యాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఇరు గ్రామ ప్రజలు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ఆనందోత్సవాలతో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## దళితులను అవమానిస్తే సహించం

- బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ ఫైర్



గద్వాల, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): బీఆర్ఎస్ పార్టీ దళితుల ఆత్మగౌరవాన్ని కించపరుస్తోందని, స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన వ్యాఖ్యలకు కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి డిమాండ్ చేశారు.జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అంటరానితనాన్ని రూపుమాపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే, బీఆర్ఎస్ మళ్లీ దానిని తెరపైకి తెస్తోందని విమర్శించారు. ఎర్రవల్లిలో కేసీఆర్ ఫామ్ హౌస్ వద్దకు దళితులు వచ్చారని పసుపు నీళ్లు చల్లారనే ఆరోపణలు దళితులను అవమానించడమేనని అన్నారు.ఏ దళితులను అవమానిస్తున్నారో ఆ దళితుడు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే మీ తండ్రి ముఖ్యమంత్రి, మీరు మంత్రి, మీ మామ మంత్రి, మీ చెల్లి ఎంపీ అయ్యారని, ఈ జ్ఞానం తెలుసుకుని దళితులను గౌరవించకపోయినా పర్వాలేదు కానీ అవమానించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి అంటూ హామీలిచ్చి పదేళ్లలో దళితులకు ఏం న్యాయం చేశారో చెప్పాలని ప్రశ్నించారు.ఈ సమావేశంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ రామేశ్వరమ్మ, డీసీసీ జనరల్ సెక్రటరీ శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## డీఐఈఓ ఆకస్మిక తనిఖీ..



శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): శ్రీరంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈఓ నరేంద్ర కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ ఇ.జె. మోజెస్ సమర్పించిన రికార్డులను పరిశీలించి విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. అధ్యాపకులతో సమావేశమై సిలబస్‌ను సకాలంలో పూర్తిచేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం రెండో యూనిట్ టెస్ట్ టాపర్లకు డీఐఈఓ, ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదవడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రగతిని నిరంతరం పర్యవేక్షించి ఫలితాల మెరుగుకు సమష్టిగా కృషి చేయాలని నరేంద్ర కుమార్ అన్నారు.

## టీబీ రహిత సమాజమే లక్ష్యం...



గుండుమాల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): టీబీ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో "టీబీ ముక్త్ భారత్ అభియాన్" ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీలో క్యాడెట్లు చార్టులు, నినాదాలు, పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ సంరక్షణ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ టీబీ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశముందని తెలిపారు. దగ్గు, తుమ్ము, మాట్లాడటం, నవ్వడం ద్వారా వెలువడే సూక్ష్మ తుంపరలతో ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందుతుందన్నారు. యువత మద్యం, మాదకద్రవ్యాలు, ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. టీబీ బాధితుల కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటయ్య, నరసింహ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయనగర్ కాలనీలో వీధి కుక్కల సంచారం



జడ్చర్ల, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): జడ్చర్ల పురపాలక సంఘం పరిధిలోని 9వ వార్డు విజయనగర్ కాలనీ రోడ్డు నెంబర్ 3లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్లపై పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతుండటంతో ప్రజలు, ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే వణికిపోతున్నారు. రాత్రి వేళల్లో వెళ్లే ద్విచక్ర వాహనదారులపైకి కుక్కలు ఒక్కసారిగా దాడికి దిగుతుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, కాలనీ వీధుల్లో గుంపులుగా చేరుతున్న కుక్కల వల్ల భయానక వాతావరణం నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి, 9వ వార్డులో వీధి కుక్కల బెడద నుండి తమకు విముక్తి కలిగించేలా తగిన చర్యలు తీసుకోవాలని విజయనగర్ కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## భక్తులను అనుగ్రహిస్తున్న బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామి



ఎర్రవల్లి, సెప్టెంబర్ 11(జనంసాక్షి): పవిత్ర కృష్ణానది తీరాన వెలసిన బీచుపల్లి శ్రీ ఆంజనేయస్వామి భక్తులను అనుగ్రహిస్తూ వారి కోరికలు తీరుస్తూ ఇలవేల్పుగా నిలిచాడు. జాతీయ రహదారి 44 పై వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పలువురు భక్తులతో నిత్యం కళకళలాడుతుంది. శుక్రవారం అమావాస్య సందర్భంగా స్వామివారికి భక్తులు మొక్కులు సమర్పించి భక్తిని చాటుకున్నారు. దేవాలయ ఈవో పురందరు కుమార్, అర్చకులు సందీప్, వాల్మీకి పూజారుల ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు.

# ఒకే వ్యక్తికి రెండు మరణ ధృవపత్రాలు.. పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్



**అచ్చంపేట, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** ఒకే మృతుడికి వేర్వేరు తేదీలతో రెండు మరణ ధృవపత్రాలు జారీ చేసిన ఘటనపై బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వి. రమేష్‌బాబును జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సస్పెండ్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు తెలిపారు. ఇటీవల "ఒక్కరికీ రెండు ధృవపత్రాలు" పేరుతో పత్రికల్లో వచ్చిన కథనాలపై అచ్చంపేట డివిజనల్ పంచాయతీ అధికారి విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం సమర్పించిన నివేదిక ఆధారంగా కలెక్టర్ ఈ చర్యలు తీసుకున్నట్లు డీపీఓ వెల్లడించారు.

విచారణ నివేదిక ప్రకారం, 2024 ఆగస్టు 1 నుంచి బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌బాబు హయాంలో ఒకే వ్యక్తికి రెండు పర్యాయాలు వేర్వేరు తేదీలతో మరణ ధృవపత్రాలు జారీ చేసినట్లు గుర్తించారు. సంబంధిత వివరాలను ఆన్‌లైన్ రికార్డుల్లో రెండుసార్లు నమోదు చేసినప్పటికీ, మరణ ధృవపత్రాల జారీ రిజిస్టర్‌లో మాత్రం ఒక్కసారి మాత్రమే నమోదు చేసినట్లు విచారణలో వెల్లడైంది.

ఒకే వ్యక్తికి వేర్వేరు తేదీలతో రెండు మరణ ధృవపత్రాలు జారీ చేయడం, గ్రామ పంచాయతీ చట్టబద్ధ రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, అధికారాలను దుర్వినియోగం చేయడం, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వంటి అంశాలను అధికారులు తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని రూల్ 8(1) ప్రకారం రమేష్‌బాబును తక్షణ ప్రభావంతో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీపీఓ తెలిపారు.

# ప్రజలకు సమర్ధవంతంగా వైద్య సేవలు అందించండి

• **డాక్టర్ సంధ్య కిరణ్మయి**

**అయిజ, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** అయిజ పీహెచ్‌సిని ఆకస్మికంగ తనిఖీ చేసిన డిఎంహెచ్ ఓ డా. సంధ్యా కిరణ్మయి.

వైద్య సేవలు, మందుల నిల్వలు, రికార్డులు, సిబ్బంది పనితీరుపై సమగ్రశీ గా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఆమె క్షుణ్ణంగ పరిశీలించారు. ఓ పి - సేవలు, మందుల నిల్వలు, ల్యాబొరేటరీ సేవలు, వ్యాక్సినేషన్, కార్యక్రమాలు, ప్రసవ సేవలు తదితర అంశాలపై సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ వైద్య సేవలను సమర్థవంతంగ అందించాలని సూచించారు.

వివిధ ఆరోగ్య కార్యక్రమాల్లో నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగ ప్రజలకు అందించే సేవలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో, ఆన్‌లైన్ పోర్టల్స్‌లో సక్రమంగ నమోదు చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా పీహెచ్ సి పరిసరాలను పరిశుభ్రంగ ఉంచడంతో పాటు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మర్యాద పూర్వకంగ మరియు బాధ్యతాయుతంగ సేవలు అందించాలని సూచించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగ అమలు చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. పీహెచ్ సి పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లోటుపాట్లను గుర్తించి వెంటనే సరిదిద్దుకోవాలని సిబ్బందికి సూచించారు.ఆమె వెంట ఎస్ ఓ తీర్మల్ రెడ్డి, -వరలక్ష్మి ఉన్నారు.



# ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బాదం నరేందర్



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తూడుకుర్తి వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో జిల్లా కన్వీనర్ మాచిపెద్ది శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా బాదం నరేందర్, ప్రధాన కార్యదర్శిగా చిగుళ్లపల్లి మహేశ్వర్, కోశాధికారిగా ఆకుతోట రాజు ఎన్నికయ్యారు. మాజీ అధ్యక్షుడు చిగుళ్లపల్లి పాండు, ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు హకీమ్ రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, పట్టణ సంఘం నాయకులు, తూడుకుర్తి సంఘం సభ్యులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు. సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

## పట్టణ ఆర్యవైశ్య సంఘం

# ఆధ్వర్యంలో వైద్య శిబిరం విజయవంతం



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో ఆర్తో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీకర ఆసుపత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు కార్యక్రమం ముందుగా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహించారు. వైద్యులను పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బిల్లకంటి. హరిబాబు ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోగులకు సేవలు అందించాలని ప్రధాన ఉద్దేశంతో వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుతోట సాయిబాబా, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు డివి నారాయణ, కార్యదర్శి హకీం కిషోర్, వీఆర్వో కంచర్ల శ్యాంసుందర్, ఆలయ కమిటీ పిఆర్ఓ అల్లంపల్లి రమేష్ తో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పట్టణ కమిటీ యువజన కమిటీ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎంఆర్పీ కంటే

# అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



**మద్దూర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** మండలంలోని ఎరువులు, వ్యవసాయ ఇన్‌పుట్ దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి ఏ. ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, బిల్లులు, ధరల పట్టికలను పరిశీలించారు. ఎంఆర్పీ కంటే అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. ప్రతి విక్రయానికి రైతులకు బిల్లు ఇవ్వాలని, స్టాక్, విక్రయ వివరాలను నమోదు చేయాలని డీలర్లకు సూచించారు. లింకేజీ, నిల్వలు దాచడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు ఎఫ్‌సీఓ నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. రైతులు ఎంఆర్పీ, రకం, బరువు, బ్యాచ్ నంబర్, బిల్లు పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు. అధిక ధర వసూలు చేస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

# ముదిరాజ్ నాయకుల ముందస్తు అరెస్ట్



**కొల్చారం, సెప్టెంబర్ 11(జనంసాక్షి):** ముదిరాజ్ కులాన్ని బిసి-డి నుంచి బిసి-ఏ లోకి మార్చాలని డిమాండ్స్ తో ముదిరాజ్ సంఘం చేపట్టిన చలో గాంధీభవన్ చలో అసెంబ్లీ నిరసన కార్యక్రమాల నేపథ్యంలో కొల్చారం మండలానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కొల్చారం పోలీస్ స్టేషన్ కు తరలించిన వారిలో ముద్రా సంఘం నాయకులు చింతల యాదగిరి, సార సుదర్శన్, మహేష్, కుమ్మరి నాగరాజు, రమేష్, తదితరులు ఉన్నారు.

# శాస్త్రవేత్తలతో విద్యార్థుల సందడి



**అయిజ, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** జెడ్పీహెచ్ఎస్ ఉప్పల విద్యార్థులు ఐఐసీటీ హైదరాబాద్‌ను సందర్శించారు. గత నెలలో పాఠశాలను సందర్శించిన ఐఐసీటీ శాస్త్రవేత్తల ఆహ్వానం మేరకు విద్యార్థులు హైదరాబాద్ వెళ్లారు. ఈ సందర్భంగా బయోగ్యాస్ ఉత్పత్తి, నీటి పరీక్షలు, ఫెరోమిన్ అప్లికేషన్ టెక్నాలజీ, మిషన్ లైఫ్, ప్లాస్టిక్ నిర్మూలన, వాతావరణ మార్పులపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కురుకురే, లేస్, చిప్స్ వంటి జంక్‌ఫుడ్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. అనంతరం బిర్లా సైన్స్ మ్యూజియం, ప్లానిటోరియం, బిర్లా మందిర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో 101 మంది విద్యార్థులు, 9 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. హెచ్ఎం డి. బలరాం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జయపాల్‌రెడ్డి, కృష్ణగౌడ్, సుధాకర్, రియాజ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు





**అడ్డాకుల, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** అడ్డాకుల మండల పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిబండ గ్రామానికి చెందిన బోయ మేకల బందన్న, బోయ మన్నెంకొండ పని నిమిత్తం బైక్‌పై అడ్డాకులకు వెళ్లి తిరిగి స్వగ్రామమైన గుడిబండకు వస్తుండగా.. కేజీఎన్ దాబా సమీపంలో గుర్తుతెలియని వాహనం వారి బైక్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా, సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వారిని చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఏదులలో కాంగ్రెస్ శ్రేణుల ధర్నా



**రేవల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్సీ తాతా మధు పరుష పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ దళితులు కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద డప్పులతో నిరసన తెలిపిన అనంతరం, బీఆర్ఎస్ శ్రేణులు పసుపు నీళ్లతో ఫామ్‌హౌస్‌ను శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ ఏదుల మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పీసీసీ, డీసీసీ, ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దళితులు ఫామ్‌హౌస్‌కు వెళ్లడంతో మైలపడిందంటూ పసుపు నీళ్లు చల్లడం దళితుల అవమానమేనని మండిపడ్డారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన విషయాన్ని కేసీఆర్ మర్చిపోయారని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని, మూడెకరాల భూమి, దళితబంధు పేరుతో దళితులను మోసం చేశారని ఆరోపించారు. దళితులను అవమానించే చర్యలకు పాల్పడితే ప్రజలు రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దళితుల ఓట్లతో గెలిచిన కేసీఆర్ దీనిపై బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ, ఏదుల మండల ఇన్‌చార్జ్ వాడల పర్వతాలు, మండల అధ్యక్షుడు పందెం సుఖేందర్‌రెడ్డి, సర్పంచులు పరశురామ్‌యాదవ్, పగడాల సంతోషమ్మ కృష్ణయ్య, పగిడాల రవి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జమ్మి మల్లేష్‌యాదవ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు జానకిరామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లాపై మూడో కన్ను: జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

• **2,221 సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా వ్యవస్థ**



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు నేరాల నియంత్రణ, నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా, నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడ తాయని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, అన్నారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవతో నేనుసైతం, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల ద్వారా పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, వ్యాపారవేత్తలు, వివిధ సంస్థలు, దాతల సహకారంతో జిల్లాలో 412 నూతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు మరమ్మతులు చేసిన పాత కెమెరాలను కలుపుకుని మొత్తం 2,221 ఆధునిక సీసీ కెమెరాల వ్యవస్థను శుక్రవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ప్రారంభించారు. జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, ముఖ్యమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఈ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా కొనసాగనుంది. వీటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయడం ద్వారా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను గుర్తించడంతో పాటు నేరాలు జరిగిన సందర్భంలో కీలక ఆధారాలను సేకరించేందుకు, నేరస్తులను గుర్తించి పట్టుకునేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయని ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, చోరీలు, గొడవలు, అనుమానాస్పద కదలికలు తదితర ఘటనలపై పోలీసులు వేగంగా స్పందించేందుకు సీసీ కెమెరాల వ్యవస్థ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో విస్తృతంగా వినియోగిస్తూ "స్మార్ట్ పోలీసింగ్ – సేఫ్ వనపర్తి" లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజల భద్రత కోసం పోలీసుశాఖ చేపడుతున్న చర్యలకు ప్రజల సహకారం ఎంతో కీలకమని ఎస్పీ అన్నారు. పోలీసులు, ప్రజలు సమన్వయంతో పనిచేసినప్పుడే నేరాలను మరింత సమర్థవంతంగా అరికట్టగలమని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ముఖ్యమైన ప్రాంతం పోలీసుల నిఘా పరిధిలోకి వచ్చేలా దశలవారీగా సీసీ కెమెరాల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు.

**దాతలకు ఎస్పీ సన్మానం...**



సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించిన దాతలు, వ్యాపారవేత్తలు, సంస్థల ప్రతినిధులు, ప్రజలకు ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన దాతలు ప్రజా భద్రత పట్ల తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారని అభినందించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను ఎస్పీ శాలువాలతో ఘనంగా సన్మానించి, వారి సేవాభావాన్ని అభినందించారు. ప్రజల భద్రత పోలీసుల ఒక్కరి బాధ్యత కాదని, సమాజం మొత్తం బాధ్యతగా భావించాలని ఆమె అన్నారు. ప్రతి గ్రామం, పట్టణం సురక్షితంగా ఉండేందుకు ప్రజలు తమ వంతు బాధ్యతగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

## మండల స్థాయిలో 23 మంది ఉత్తమ ఉపాధ్యాయులు



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా న్యాల్‌కల్ మండలంలోని 23 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంఈఓ మారుతీ రాథోడ్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ నరేష్, ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉప తహసీల్దార్ మల్లికార్జున స్వామి హాజరయ్యారు. మండలంలోని 196 మంది ఉపాధ్యాయుల్లో ఎంపికైన 23 మందికి ప్రశంసా పత్రాలు అందజేసి, శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## క్రీడా పోటీల్లో విద్యార్థుల జోరు



**గండీడ్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** గండీడ్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండలస్థాయి పాఠశాల క్రీడా పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఎంఈఓ ఆర్.జనార్ధన్ పోటీలను ప్రారంభించారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. అండర్–17 కబడ్డీలో తెలంగాణ గురుకుల మోడల్ పాఠశాల, అండర్–14లో పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ గండీడ్ జట్లు విజేతలుగా నిలిచాయి. అండర్–14, 17 ఖోఖోలో జెడ్పీహెచ్ఎస్ వెన్నచేడ్ జట్లు ప్రథమ స్థానాలు సాధించాయి. విజేతలను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.భగవంత్‌రెడ్డి, ఉపసర్పంచ్ చెన్నయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## నిడిజింత జెడ్పీహెచ్ఎస్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య పోటీలు



**కొత్తపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** నిడిజింత జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ బునీద్, జెడ్పీహెచ్ఎస్ నిడిజింత, యుపిఎస్ కొత్తపల్లి, యుపిఎస్ గోకుల్‌నగర్ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వాలీబాల్, ఖో–ఖో, కబడ్డీ తదితర క్రీడల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పోటీపడి తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నిడిజింత గ్రామ సర్పంచ్ శ్రీమతి రజిత శ్రీనివాస్ రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను అభినందిస్తూ, క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే తత్వం పెంపొందుతాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో నిడిజింత జెడ్పీహెచ్ఎస్ పాఠశాల జిహెచ్ఎం ఆంజనేయులు పాల్గొన్నారు. అలాగే నిర్జింత, బునీద్, గోకుల్‌నగర్, కొత్తపల్లి పాఠశాలల ఉపాధ్యాయులు, పి ఈ టి కథలప్ప, వెంకటప్ప, బసంత్ రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొని క్రీడా పోటీలను విజయవంతం చేశారు.

## మండల సర్వసభ్య సమావేశంలో వెల్లువెత్తిన సమస్యలు



**ఉర్కొండ, సెప్టెంబర్ 11 (జనం సాక్షి):** ఉర్కొండ రైతు వేదికలో మండల సర్వసభ్య సమావేశం ప్రత్యేక అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయం, విద్యుత్, విద్య, వైద్యం, గ్రామీణ రోడ్లపై అధికారులు నివేదికలు సమర్పించారు. విద్యుత్ సరఫరాపై సర్పంచులు, అధికారుల మధ్య వాడివేడి చర్చ జరిగింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు 11 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని ఏఈ తెలిపారు. సబ్సిడీ విత్తనాలు నాణ్యతగా లేవని, సకాలంలో అందడం లేదని సర్పంచులు ఏవో దీప్తిని ప్రశ్నించారు. యూరియా యాప్‌ను రైతులు ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ యూసుఫ్‌అలీ, విద్యాధికారి అబ్దుల్‌రహీం, ఎంపీవో, ఏపీవో, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మద్దూర్‌లో గణేష్ విగ్రహాల పంపిణీ



**మద్దూర్, సెప్టెంబర్ 11(జనంసాక్షి):** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మద్దూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్దూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి ఢిల్లీకర్ సరస్వతి జనార్ధన్, మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ పాల్గొని గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, కమిషనర్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, పర్యావరణహితంగా ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐదు రోజుల పని వారానికి బ్యాంకు ఉద్యోగుల సమ్మె






**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** ఐదు రోజుల పని వారాన్ని అమలు చేయాలని, పర్ఫామెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ యూఎఫ్‌బీయూ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేపట్టారు. నాగర్‌కర్నూల్‌లో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఉద్యోగులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. పని–వ్యక్తిగత జీవన సమతుల్యత కోసం ఐదు రోజుల పని విధానం అవసరమని ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఈ డిమాండ్ కీలకమన్నారు. కేంద్ర ప్రభుత్వం సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమ్మెలో ఎస్‌బీఐ జిల్లా శాఖల ఉద్యోగులు, అధికారులు పాల్గొనగా, యూనియన్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు మద్దతు తెలిపారు. UFBU ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులు, పృథ్వీ, అభి, కిషోర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మట్టి గణపతులతోనే పర్యావరణ పరిరక్షణ



**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులను పంపిణీ చేసిన శ్రీరంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్ఫూర్తిగా నిలిచారు. శ్రీరంగాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు వివిధ రూపాల్లో ఆకర్షణీయమైన మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. ఈ విగ్రహాల తయారీలో ఉపాధ్యాయులు లిజి. నరసింహ, ఎన్. పద్మమ్మ, సౌజన్యలి గార్లు విద్యార్థులను ప్రోత్సహిస్తూ, మెళకువలు నేర్పుతూ అందుబాటులో ఉన్నారు. సాయంత్రం జరిగిన సమావేశానికి ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "స్వాతంత్ర్యానికి ముందు ప్రజల్లో ఐక్యత కోసం 1893లో బాలగంగాధర్ తిలక్ బొంబాయిలో గణేష్ ఉత్సవాలను ప్రారంభించారు. అప్పట్లో సహజ మట్టి విగ్రహాలనే నిమజ్జనం చేసేవారు.
నేడు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో చెరువులు కలుషితమవుతున్నాయి. అందుకే మన విద్యార్థుల చేత మట్టి విగ్రహాలు తయారు చేయించి, సహజ వినాయకుల ప్రాశస్త్యాన్ని గ్రామస్తులకు తెలియజేస్తున్నాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ విభాగంలో – ప్రథమ బహుమతి కృష్ణ కుమార్ (10వ తరగతి), ద్వితీయ పరివర్తన్ (10వ తరగతి), జూనియర్ విభాగంలో – ప్రథమ భువనేశ్వరి (6వ తరగతి), ద్వితీయ జస్వంత్ (6వ తరగతి) విద్యార్థులు గెలుపొందారు. **"మట్టి వినాయకుడే ముద్దు – పర్యావరణాన్ని కాపాడుకుందాం"** – ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి అన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

- **పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి: అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



వనపర్తి, సెప్టెంబర్ 11 (జనం సాక్షి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచించారు. ఐడీఓసీలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని విగ్రహాలను పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగులతో నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి నిమజ్జనం చేయడం ద్వారా జల కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. 'మట్టి వినాయకుడు-స్వచ్ఛమైన పర్యావరణం' సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి...**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యం కోరారు. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నాణ్యమైన వైర్లు ఉపయోగించాలని, విద్యుత్ శాఖ సూచనలు పాటించాలని తెలిపారు. డీజేలను నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాలని, అధిక శబ్దంతో వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, రోగులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మండపాలు, ప్రధాన రహదారులు, నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం రోజున వైన్‌షాపులు మూసివేస్తామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్, విద్యుత్, మున్సిపల్, పంచాయతీ, పారిశుద్ధ్య శాఖల అధికారులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ పాటించకుండా రేషన్ కార్డుల పంపిణీ



**పర్వతాపూర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** గ్రామంలో ప్రోటోకాల్ నిబంధనలు పాటించకుండా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టారని సర్పంచ్ కొత్ర ప్రసన్న ఆరోపించారు. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. గ్రామ పంచాయతీ ఆవరణలో కాకుండా అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో టెంట్ ఏర్పాటు చేసి కార్డులు పంపిణీ చేశారని పేర్కొన్నారు. ఇతర గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, స్థానిక కార్యకర్తలు కలిసి కార్యక్రమం నిర్వహించారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమం చేపట్టడం ప్రోటోకాల్‌కు విరుద్ధమన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, సంబంధిత అధికారులు, వీఆర్ఏపై తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను సులభతరం చేయాలి

**తహసీల్దార్‌కు టీఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్ వినతి**



**జడ్చర్ల, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** మండలంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను సులభంగా, పారదర్శకంగా నిర్వహించాలని టీఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తాహెర్ మాట్లాడుతూ ఇప్పటికే వివరాలను మ్యాపింగ్ చేయించుకున్న ఓటర్లకు కూడా నోటీసులు వస్తున్నాయని తెలిపారు. నోటీసుల్లో కారణాలు, సరిచేయాల్సిన వివరాలు, సమర్పించాల్సిన పత్రాలపై స్పష్టత లేకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల వృద్ధులు, మహిళలు, గ్రామీణ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, జారీ చేసే నోటీసుల్లో పూర్తి స్పష్టంగా పేర్కొనాలని కోరారు. అలాగే ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించి సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గడ్డి పాండు పాల్గొన్నారు.

## కేఎల్ఐ నీటిని వెంటనే విడుదల చేయాలి



**మిడ్జిల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక పాలనతో అన్నదాతలు నష్టపోతున్నారని బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకులు పల్లె తిరుపతి ఆరోపించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) ద్వారా సాగునీరు అందిస్తామని నమ్మించి కేవలం 15 రోజులు నీరు విడుదల చేసి నిలిపివేయడం దారుణమన్నారు. నీటి ఆధారంగా వరి, వేరుశనగ తదితర పంటలు సాగు చేసిన రైతులు ఇప్పుడు పంటలు ఎండిపోతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కేఎల్ఐ ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ఉపాధ్యాయులే సమాజానికి మార్గనిర్దేశం



**పాపన్నపేట, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) :** సమాజంలో ఉన్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని, ఎంత ఎత్తుకు ఎదిగినా గురువులను మర్చిపోవద్దని, సమాజానికి గురువులే దిక్సూచి అని తహశీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో విష్ణువర్ధన్ అన్నారు. మండల విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకను కొత్తపల్లి లోని ఓ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మండల స్థాయిలో ముప్పై రెండు మంది ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఏడుగురిని సన్మానించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్,శ్రీనివాస్ రావు, భూజాత, శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు.. పంతుల రాజు, బాలరాజు, ఎల్లం, దుర్గా ప్రసాద్, భూషణం ,సురేష్,రమేష్, బాలమల్లేష్, రాజశేఖర్, వెంకట్రామ్ రెడ్డి, నాగభూషణం, సాయిసిరి, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు..

# కేసుల దర్యాప్తులో జాప్యం వద్దు

- **పెండింగ్ కేసులను వేగవంతంగా పూర్తి చేయాలి**
- **వినాయక చవితికి పటిష్ఠ బందోబస్తు**
- **వీపీఓల సేవలను సమర్థవంతంగా వినియోగించాలి**
- **మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**




**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల పురోగతిని సమీక్షించారు.

కేసులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా దర్యాప్తు పూర్తి చేసి సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని ఎస్పీ సూచించారు. గ్రేవ్ కేసుల్లో సంఘటనా స్థలంలో లభించే ఆధారాలను పకడ్బందీగా సేకరించాలని, శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగించి నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా పటిష్ఠమైన కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

మిస్సింగ్ కేసుల్లో ప్రత్యేక దృష్టి సారించి బాధితుల ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని సూచించారు. ఎన్‌బీడబ్ల్యూ కేసుల్లో వారెంట్ల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు.

**వినాయక చవితికి పటిష్ఠ బందోబస్తు...**

రాబోయే వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. మండపాల వద్ద విద్యుత్, అగ్నిప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వీపీఓల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిమజ్జన మార్గాలు, రద్దీ ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉత్తమ ప్రతిభకు ప్రశంసా పత్రాలు నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసిన ఐఓలు రేణుకరెడ్డి, వెంకటరాజాగౌడ్, రంగా కృష్ణతో పాటు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

ఈ సమావేశంలో డీఎస్పీలు సుభాష్‌చంద్రబోస్, నరేందర్‌గౌడ్, సీఐలు రేణుక, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరాజాగౌడ్, జార్జ్, సందీప్‌రెడ్డి, కృష్ణమూర్తి, రంగా కృష్ణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గౌతపూర్ గుట్టపై భక్తి పారవశ్యం



**బాలానగర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం గౌతపూర్ గ్రామంలోని గుట్టపై వెలసిన శ్రీ విజయలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో శ్రావణమాస ముగింపు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి ఆత్మజ్ఞాని శ్రీశ్రీశ్రీ హరిబాలానందదాసు స్వామి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ, భక్త జ్ఞాన సేవా సమితి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక అర్చనలు, ఆరాధనలు చేశారు.

అనంతరం ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని పూలమాలలు, కాషాయ జెండాలతో శోభాయమానంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. 40 రోజులుగా ఆలయంలో నిర్వహిస్తున్న నిరంతర భజన కార్యక్రమాలు, శ్రావణమాస దీక్ష ముగింపు సందర్భంగా పల్లకీ సేవ చేపట్టారు. జై శ్రీరామ్, జై శ్రీ ఆంజనేయ నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. యువకులు, మహిళలు, చిన్నారులు కోలాటాలు, అడుగుల భజనలు, భక్తి పాటలతో ఉత్సాహంగా పాల్గొని పల్లకీని భుజాలపై మోస్తూ ఊరేగించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకుని పల్లకీ సేవలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా హరిబాలానందదాసు స్వామి మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని, భారతీయ సంస్కృతిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ దైవచింతన, సేవాభావంతో మెలగాలని, అసూయ, ద్వేషం, స్వార్థాన్ని విడనాడి నిస్వార్థంగా, మానవత్వంతో జీవించాలని హితబోధ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్త జ్ఞాన సేవా సమితి సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన
## కార్యదర్శిగా భూమిగారి రాజేందర్



**చేర్యాల, సెప్టెంబర్ 11(జనంసాక్షి):** చేర్యాల మండల కేంద్రానికి చెందిన భూమిగారి రాజేందర్‌ను ఎంఆర్పి ఎస్ జాతీయ కమిటీ, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఇటీవల హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ నిర్మాణ కార్యక్రమం లో భాగంగా భూమిగారి రాజేందర్ ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొని జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న, రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ ఆధ్వర్యంలో ఆమోద పత్రం అందించారు. ఈ సందర్భంగా భూమిగారి రాజేందర్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో ఇంతటి బాధ్యతను ఇచ్చిన జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న, రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ కు రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, మండలాల కమిటీ నాయకులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ను బలోపేతం చేస్తూ దళిత జాతి అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాశపాక రాజేందర్, గంట సుదర్శన్,మేడ స్వామి, సిద్దిని రాజమల్లయ్య, బొంబాయి వెంకన్న, జిల్లా అధ్యక్షులు దేవులపల్లి రాజేందర్,జిల్లా ఇంచార్జి లింగాల కృష్ణ,బాలిగారి కృష్ణ,దప్పు ఎల్లం,ముస్త్యాల నవీన్,గద్దం వెంకటేష్,లింగాల మహేష్,లింగాల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో శ్రీమంతం, అక్షరాభ్యాస వేడుకలు



**చేర్యాల, సెప్టెంబర్ 11(జనంసాక్షి):** చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామ అంగన్వాడీ కేంద్రం-1 లో గర్భిణి స్త్రీలకు శ్రీమంత వేడుకలు, పిల్లలకు అక్షరాభ్యాస వేడుకను అంగన్వాడీ టీచర్ తాటికొండ ఉమారాణి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఆర్పి సత్యలక్ష్మి, వివో అధ్యక్షురాలు డి.సులోచన, పాఠశాల ఉపాధ్యాయురాలు సరోజినీ,రజిత పాల్గొని పోషణ మసం యొక్క ప్రాముఖ్యత, తక్కువ ఖర్చుతో మనకు అందు బాటులో దొరికే కూరగాయలు, ఆకు కూరలు, చిరుదాన్యాలు, పండ్లు, పాల యొక్క ఉపయోగాలు తల్లులకు అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు, పిల్లల తల్లిదండ్రులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

### ప్రత్యేక అవసరాల
## పిల్లల సేవలో నిర్లక్ష్యం వద్దు: జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

ప్రత్యేక అవసరాల పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. చిత్రలేఖనం, సంగీతం, క్రీడలు, చదువు తదితర రంగాల్లో ఆసక్తిని గుర్తించి తగిన అవకాశాలు కల్పిస్తే వారు ఉన్నత విజయాలు సాధిస్తారని అన్నారు. ఉట్కూర్‌లో స్వచ్ఛంద సంస్థ సహకారంతో వినికిడి లోపం ఉన్న చిన్నారులకు పరికరాలు అందించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ నెల 15న అలంకో సంస్థ సహకారంతో జిల్లా స్థాయిలో ప్రత్యేక క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజు, రాజేందర్, నాగరాజ్, ఎంఈవో, డీపీఆర్ఓ రషీద్, డాక్టర్ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# కోతుల బెడదకు అడ్డుకట్ట వేయాలి

- **ప్రజలు, రైతులకు ఉపశమనం కల్పించేలా పటిష్ఠ చర్యలు**
- **జిల్లాలో సుమారు 6,500 కోతులు ఉన్నట్లు అంచనా**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**





**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** కోతుల బెడద నుంచి ప్రజలు, రైతులకు ఉపశమనం కల్పించేలా మున్సిపల్ కమిషనర్లు పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. కోతుల నియంత్రణ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి, సమగ్ర కార్యాచరణతో సమస్యను పరిష్కరించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి నర్సాపూర్, తూప్రాన్, మెదక్, రామాయంపేట మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో సూచించిన అంశాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ల నివేదికల ప్రకారం మెదక్‌లో సుమారు 3,000, నర్సాపూర్‌లో 2,000, తూప్రాన్‌లో 1,000, రామాయంపేటలో 500 కోతులు ఉన్నట్లు అంచనా వేశారు.

మొత్తం సుమారు 6,500 కోతులు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. కోతుల బెడద నివారణను యుద్ధప్రాతిపదికన చేపట్టి, దశలవారీగా కోతులను పట్టుకుని నిర్మల్ జిల్లాకు తరలించి, అక్కడ అవసరమైన ఆపరేషన్ అనంతరం వాటిని అడవుల్లో వదిలేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ చర్యలతో ప్రజలు, రైతులకు కోతుల బెడద నుంచి గణనీయమైన ఉపశమనం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

కోతుల నియంత్రణ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి దశలవారీగా ముందుకు సాగితే సమస్యను గణనీయంగా నియంత్రించవచ్చని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ఇందుకు ప్రజలు, రైతులు, అన్ని వర్గాల సహకారం అవసరమని పేర్కొన్నారు. మెదక్ జిల్లాను కోతుల నియంత్రణలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ నగేష్, డీఎఫ్ఓ జోజి, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# కుష్ఠువ్యాధి నిర్మూలన మన బాధ్యత

- **రాష్ట్ర శాంపిల్ సర్వే అసెస్మెంట్ టీం డా.సంపత్**





**మెదక్ టౌన్ సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, మెదక్ లో లెప్రసీ నోడల్ ఆఫీసర్లకు కుష్ఠువ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో కుష్ఠువ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూపర్వైజరీ స్టాఫ్, ఏ.ఎన్.ఎం.లు, ఆశ కార్యకర్తలు క్షేత్రస్థాయి లో అనుమానిత కుష్ఠువ్యాధి లక్షణాలు గల వ్యక్తులను గుర్తించి, డాక్టర్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి త్వరితగతిన మందులు వాడించడం ద్వారా కుష్ఠువ్యాధి పూర్తిగా నయం అవుతుందని, నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యం బారిన పడవచ్చని రాష్ట్ర శాంపిల్ సర్వే అసెస్మెంట్ టీం డా. సంపత్ తెలిపారు. జిలా కుష్ఠువ్యాధి నివారణ అధికారి డా. హరిప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ప్రణాళికతో కుష్ఠువ్యాధి నిర్మూలన కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది ద్వారా ఇంటింటికి సర్వే నిర్వహించామని, అనుమానిత లక్షణాలు గల వారిని గుర్తించి, డి.పి.ఎం.ఓ.లు వారిని క్షుణ్ణంగా పరిశీలించి, డాక్టర్ ద్వారా మరల పరీక్షలు చేయించి చికిత్సలు మొదలు పెడుతున్నామని తద్వారా జిల్లా లో కుష్ఠువ్యాధి నిర్మూలనలో ఆరోగ్యశాఖ సిబ్బంది చురుగ్గా పనిచేస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పి.ఎం.ఓ. శంకర్ రాథోడ్, డిప్యూటీ పార మెడికల్ అధికారులు వెంకటేశ్వర చారి, శ్రీనివాస్, సంతోష్, వివిధ పి.హెచ్.సి.ల నుండి లెప్రసీ నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఉదయం పూట రాష్ట్ర శాంపిల్ సర్వే మరియు అసెస్మెంట్ టీం మెదక్ జిల్లాలోని మనోహరాబాద్, శివంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.

# ప్రభుత్వ భూమిలో అక్రమ డబ్బాలను తొలగించండి

- **కోర్టు ఆర్డర్‌ను ఎందుకు అధికారులు అమలు చేయడం లేదు**
- **మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి**

**మక్తల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 7లో బోగస్ సర్టిఫికెట్లు సృష్టించి కోట్లాది రూపాయల విలువైన స్థలంలో అక్రమంగా వేసిన డబ్బాలను అధికారులు ఎందుకు తొలగించడం లేదని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి నిలదీశారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ

పదిహేను రోజుల క్రితం ఇదే సర్వే నెంబర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా, బోగస్ సర్టిఫికెట్లతో వేసిన కొన్ని డబ్బాలను తొలగించిన అధికారులు.. మిగతా వాటి విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని చూస్తుంటే చట్టం కొందరికి మాత్రమే చుట్టంగా మారిందనే విమర్శలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సర్వే నెంబర్ 7లో వేసిన అక్రమ డబ్బాలను తొలగించాలని, 2003లో అప్పటి తహసీల్దార్ ఇచ్చిన బోగస్ సర్టిఫికెట్లు ఏవీ చెల్లవని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆర్డర్ నెంబర్ 1606/2013 ద్వారా స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందని రామ్మోహన్ రెడ్డి గుర్తుచేశారు. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు కాలయాపన చేస్తుండటం వెనుక ఏ రాజకీయ నాయకుల ఒత్తిడి ఉందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు అక్రమ డబ్బాలను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేసినా స్థానిక అధికారులు వెనకడుగు వేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఇప్పటివరకు ఇచ్చిన సర్టిఫికెట్లన్నింటిపై సమగ్ర విచారణ జరిపి, ఏవి అసలువో, ఏవి బోగస్సో తేల్చాలని కోరారు. కొందరు కేవలం 100 గజాల



సర్టిఫికెట్లను చూపించి 200 నుండి 400 గజాల వరకు భూమిని ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. సర్వే నెంబర్ 7లో వాస్తవంగా ఎంతమందికి సర్టిఫికెట్లు ఇచ్చారు? ఎంత భూమి కేటాయించారు? అనే వివరాలను స్థానిక తహసీల్దార్ వెంటనే బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. అక్రమంగా వేసిన డబ్బాలను, అనధికార నిర్మాణాలను తక్షణమే తొలగించాలని, లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు కొత్త శ్రీనివాస్, కొత్త పి. నరసింహ గౌడ్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు చిన్న హనుమంతు, అన్వర్ హుస్సేన్, జుట్ల శంకర్, మానాన్, జుట్ల సాగర్, శివారెడ్డి, సాదిక్, బండారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### న్యాల్ కల్ లో.."మహా అవతార్"
## ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 11, (జనంసాక్షి) :** మండల కేంద్రమైన న్యాల్ కల్ లోని శ్రీ హనుమాన్ దేవాలయంలో గణపతి ఉత్సవాలను ఘనంగా చేపట్టేందుకు ఉత్సవ నిర్వాహకులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. "మహ అవతార్" యువజన సంఘం, యువత ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలోని శ్రీ మల్లికార్జున హోటల్ ఆవరణలో.."గణేష్ ఆగమన్" గోడపత్రికను ఆవిష్కరించారు. రూ:51000 విలువ గల గణేష్ మహా విగ్రహాన్ని హైదరాబాద్ నుండి మండలంలోని శ్రీ ఆదిలక్ష్మి ఆశ్రమంలో ఇటీవల ఉంచారు. ఆగమన్ కార్యక్రమంలో భాగంగా.. వినాయక చవితి పర్వదినం శుభ సందర్భంగా.. ఈనెల 12, శనివారం ఉదయం ముంగి ఆశ్రమం నుండి న్యాల్ కల్ ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ వాహనంలో తీసుకువచ్చేందుకు ఏర్పాటు సిద్ధం చేశారు. "గణేష్ ఆగమన్" కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నిర్వాహక భక్తులు కోరారు. గోడ పత్రిక ఆవిష్కరించిన వారిలో యువ భక్తులు కృష్ణ, భవాని శంకర్, యువభక్తులు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్.పి

- **నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

**మహబూబ్ నగర్ బ్యూరో సెప్టెంబర్ 11(జనంసాక్షి):**
వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్.పి. శ్రీమతి డి.జానకి అధికారులను ఆదేశించారు.

వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలోని పలు చెరువులు, ఇతర నీటి వనరుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్న, మధ్య తరహా విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న కృత్రిమ బేబీ పాండ్ ను, పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులను శుక్రవారం కలెక్టర్, ఎస్.పి సంయుక్తంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా క్రిస్టియన్ పల్లి పంచవటి పాఠశాల సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన కృత్రిమ బేబీ పాండ్‌తో పాటు పాలకొండ చెరువు, శ్రీనివాస్ కాలనీ చెరువు, అప్పన్నపల్లి చెరువు, చిన్నదర్పల్లి చెరువులను పరిశీలించి, నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అప్పనపల్లి చెరువు వద్ద ఎక్కువ వినాయక విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున, అక్కడ రెండు పెద్ద బేబీ పాండ్లను నిర్మించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

చిన్న, మధ్య తరహా విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాల్లో బేబీ పాండ్ లను ఏర్పాటు చేయాలని, వాటిలో తగినంత నీరు ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని జిల్లా ఎస్.పి ఆదేశించారు.

నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలు, బారికేడ్లు, పారిశుధ్య సౌకర్యాలు, తాగునీరు, ప్రవేశం--నిష్క్రమణ మార్గాలు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం అనంతరం విగ్రహాల అవశేషాలు, పూజా సామగ్రి, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

బేబీ పాండ్‌ల వద్ద నిరంతరం పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, నీటి నాణ్యతను పర్యవేక్షించాలని తెలిపారు. నిమజ్జనం పూర్తయిన అనంతరం పాండ్లను శుభ్రపరిచి, అవసరమైన మేరకు నీటిని తొలగించి,



ఆయా ప్రాంతాలను యథావిధిగా పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

బేబీ పాండ్లు, నిమజ్జన కేంద్రాల వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేసేలా మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ సమీపంలోని నిర్దేశిత నిమజ్జన కేంద్రాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన నీటి లభ్యతను పరిశీలించి, అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రాంతాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వచ్చే పెద్ద విగ్రహాల నిమజ్జనానికి బీచుపల్లి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని గద్వాల జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. దీనిపై గద్వాల జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని కలెక్టర్ వెల్లడించారు.

నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసు, మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్.పి.లు సూచించారు. నిమజ్జన కేంద్రాల వద్ద తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు.

నిమజ్జన కేంద్రాలకు విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలకు అనుకూలంగా ప్రవేశ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, నిమజ్జనం అనంతరం తిరిగి వెళ్లే మార్గాలను ముందుగానే సిద్ధం చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు శాఖతో సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్





సూచించారు.

అనంతరం పాతపల్లి పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను, దాని ప్రక్కనే ఉన్న శిల్పారామాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ సంయుక్తంగా సందర్శించారు. పెద్ద చెరువులో జరుగుతున్న పనులు, వాటి పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిల్పారామంలోని స్టాళ్ల కేటాయింపుల వివరాలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా వి.హెచ్.పి. అధ్యక్షులు యాది రెడ్డి, ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీల ఖచ్చితమైన లెక్క తేలితేనే విద్య, ఉద్యోగాల్లో న్యాయం

- **బీసీ కులగణన శాస్త్రీయంగా నిర్వహించాలని సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట బీసీల ధర్మ పోరాట దీక్ష**
- **ప్రతి బీసీ కులానికి యూనిక్ కోడ్, ప్రత్యేక బీసీ కాలమ్ ఏర్పాటు చేయాలి**
- **సంఘీభావం తెలిపిన డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** బీసీ కులగణన శాస్త్రీయంగా నిర్వహించాలని సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట బీసీల ధర్మ పోరాట దీక్ష శుక్రవారం నిర్వహించారు. ఈ దీక్ష కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి సంఘీభావం తెలియజేశారు. సందర్భంగా దీక్షలో పాల్గొన్న వక్తలు, బిసి సంఘ నాయకులు మాట్లాడుతూ
దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ జనగణనలో బీసీ కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం 2025 మే 1న ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ప్రకటించింది.అయితే ప్రస్తుత విధానంలో బీసీల జనాభాను శాస్త్రీయ పద్ధతిలో లెక్కించకుండా, ఓబీసీ కుటుంబాలను సమగ్రంగా నమోదు చేయకుండా, ప్రత్యేక బీసీ కాలమ్ ఏర్పాటు చేయకుండా, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించకుండా కులగణన నిర్వహిస్తే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.బీసీల ఖచ్చితమైన జనాభా లెక్కలు అందుబాటులో ఉంటేనే విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాలు మరియు రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుందని



కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు.బీసీల భవిష్యత్తు తరాలకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పారదర్శకమైన బీసీ కులగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు.

దీక్షా కార్యక్రమంలోఆర్.సి.పురం మాజీ కార్పొరేటర్ పుష్పా నాగేష్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడుసుకూరి జగదీశ్వర్ బీసీ యువ జన సంఘం జిల్లా అధ్యక్షుడు- గౌరుగంటి రమేష్,బాలు యాదవ్, లాడే మల్లేష్, యాదగిరి, ప్రభు గౌడ్, రామ నారాయణ, శ్రీనివాస్ గౌడ్, పద్మారావు, నాగరాజ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల సొంత ఆదాయం ఖాతాల్లోనే జమ

**మిడ్జిల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** గ్రామపంచాయతీల సొంత ఆదాయాన్ని నేరుగా పంచాయతీ బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతాల్లో జమ చేసుకునేలా ప్రభుత్వం చట్ట సవరణ చేయడంపై సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70(3) సవరణ బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. గతంలో పన్నులు, ఇతర ఆదాయాలను ట్రెజరీలో జమ చేయడంతో అత్యవసర పనులకు నిధుల వినియోగంలో జాప్యం జరిగేదన్నారు. తాజా నిర్ణయంతో పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ లభించడంతో పాటు వీధిదీపాలు, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతుల పనులకు



నిధులను వేగంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎడ్ల శంకర్, ఉపాధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శులు గోదా శ్రీశైలం, రాములు, ధర్మనాయక్, రాజునాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అవకతవకలకు తావులేకుండా భూ రీ సర్వే



తదుపరి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ ల్యాబ్, ఎక్స్‌రే కేంద్రాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, వసతులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని వైద్యులను సూచించారు. డెంగ్యూ, టీబీ తదితర వ్యాధులపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్స్‌రే సేవలను మరింత వినియోగంలోకి తీసుకువచ్చి రోజుకు 50 మందికి పైగా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వినోద్, సర్వే ఏడీ, తహశీల్దార్ బి. సుగుణ, ఎంపీడీవో విజయసింహారెడ్డి, ఎస్ఐ వెంకటేష్, డాక్టర్ ప్రవీణ్, సర్వే అధికారులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## 5వ వార్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి




**మద్దూరు, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** మున్సిపాలిటీ 5వ వార్డు కేకే కాలనీ, తిరుమల కాలనీ, బూనేడు రోడ్డు, రేనివాట్ల రోడ్డుసైడ్ ప్రాంతాల్లో వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. చీకటి కారణంగా మహిళలు,వృద్ధులు,చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాములు, తేళ్లు, కుక్కలు, పందుల సంచారంతో భయాందోళన నెలకొందన్నారు. పనిచేయని ఎల్ఈడీ, హైమాస్ట్ లైట్లను మరమ్మతు చేయాలని, తిరుమల కాలనీలో ఆరు విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎర్రగుంట తండా, ఎర్రగొల్లు తండాల్లో లైట్లు పునరుద్ధరించి, వాయల్‌కుంట తండాలో స్తంభాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

## జలసాధన సత్యాగ్రహాన్ని విజయవంతం చేయండి



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ గాంధీ పార్క్‌లో సెప్టెంబర్ 12న నిర్వహించే జలసాధన సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని పెండింగ్ ప్రాజెక్టుల జేఏసీ జిల్లా చైర్మన్ మొసలి శ్యాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, రైతులు, మేధావులు, తెలంగాణ ఉద్యమకారులు దీక్షకు హాజరుకావాలని కోరారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం ఐక్యంగా పోరాడాలని అన్నారు. పాలమూరు లిఫ్ట్ నీటిని నల్లగొండ వైపు మళ్లించే డిండి ప్రాజెక్టును రద్దు చేసి, చంద్రసాగర్-అమ్రాబాద్ లిఫ్ట్ ప్రాజెక్టు చేపట్టాలని డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించాలని కోరారు. జిల్లాను సస్యశ్యామలం చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు.